Entered

ప్రజాశక్తి ఆదివారం అనుబంధం

జూన్ 25, 2006



గ్వాంటనామో బే

చిత్రహింసలకు చిరునామా

హ్యాపీ బర్త్ డే

(25.6.2006 నుండి 1.7.2006 వరకు)

ఆర్. లిఖిత
2సం॥, జూన్-25
విజయలక్ష్మి-శ్రీధర్
నరసింగరావుపేట-విశాఖ

జి. ప్రభాత్
7సం॥, జూన్-25
లత-వెంకట్‌గౌడ్
చొరకొండ-మ॥నగర్

కె. లిఖితకల్యాణి
3సం॥, జూన్-26
రమణి-కోటినాయుడు
జొన్నాడ-విజయనగరం

బి. రోహిత్‌వర్మ
1సం॥, జూన్-27
జ్యోతిర్మయి-రాజగోపాల రాజు
కాకాని నగర్-విశాఖపట్నం

శైలు
1సం॥, జూన్-27
సునీత-వెంకటస్వామి
వెంకట్రావుపేట-ఆదిలాబాద్

ఎస్. పవన్ ఆదిత్య
2సం॥, జూన్-27
రూప-వెంకటరావు
పద్మావతినగర్-విజయనగరం

వి. మౌనిక
జూన్-28
అరుణ-సుబ్బారావు
తుమ్మలపల్లి-ఖమ్మం

జి. సాయికుమార్
జూన్-28
మంగలక్ష్మి-సత్తిబాబు
వడ్డాది-విశాఖపట్నం

ఎన్. సాయిమానస
4సం॥, జూన్-30
అన్నపూర్ణ-సైదులు
కొండ్రపోలు-నల్లగొండ

కె. చంద్రవంశీ
5సం॥, జూన్-2001
రాజ్యలక్ష్మి-వీరయ్య
ముషీరాబాద్-హైదరాబాద్

జి. సృజన
1సం॥, జూన్-2005
జిజియా-రమేష్
శనివారపుపేట-ఏలూరు

వర్షిణి
2సం॥, జూన్-2004
కల్యాణి-నరసింహారావు
తాడేపల్లి-గుంటూరు

పి. పూజిత
జూన్-25
రామకుమారి-ఉపేంద్ర
తెల్దారుపల్లి-ఖమ్మం



ఈ తరం చాలా తెలివైంది...

ప్రస్తుత సమాజంలో నైతిక విలువలు కనుమరుగయ్యే పరిస్థితులు నెలకొంటున్నాయి. కాలాలు, యుగాలు, సంస్కృతులు మనిషిని మనిషిగా చూసే విధంగా నైతిక విలువలుండాలి. మార్పు అనేది సహజం. అయితే ఈ మార్పు అన్ని రంగాల్లో వస్తోంది. మానవాళి మనుగడకు, అభివృద్ధికి ఇది ఉపయోగపడాలి. ఈ మార్పులో అందరూ భాగస్వాములు కావాలి. దీంతో అందరూ ఆనందంగా ఉండాలి. మా జనరేషన్‌లో డబ్బున్నా లేకపోయినా, చదువున్నా, లేకపోయినా ప్రేమ, ఆప్యాయతతో అందరం కలిసుండేవాళ్లం. కులమత విబేధాలుండేవి కావు. నేడు పరిస్థితి మారి, అంతా కమర్షియల్ అయ్యింది. న్యూక్లియస్ కుటుంబాలు పెరిగాయి. ప్రతి ఒక్కరు తమ గురించి తాము ఆలోచించడం పెరిగింది. దీంతో స్నేహితులు, బంధువులు, ఆప్తులను పట్టించుకోవడం లేదు. అవసరాన్ని బట్టి మనుషుల మధ్య సంబంధాలు నెలకొం టున్నాయి. అవసరం తీరాక మర్చిపోవడం సాధారణమైపోయింది. నేటి యువతరం మా కంటే చాలా తెలివైంది. కాని కొన్ని విషయాల్లో మాత్రం వీరిని తప్పుపట్టకతప్పదు. అంటే డ్రగ్స్, ఆల్కహాల్ మొదలైన అంశాల్లో. ఇప్పుడున్న కమ్యునికేషన్ వ్యవస్థ, గ్లోబలైజేషన్, లిబరలైజేషన్ వల్ల ఈ కాలపిల్లలు తెలిసీతెలియక పెడదారిపడుతున్నారు. ఫలితంగా యువతలో దాగున్న శక్తి నిర్వీర్యమయ్యే అవకాశాలున్నాయి. వీరిని కాపాడాల్సిన బాధ్యత పెద్దలందరిదీ.

స్వార్థాన్ని తగ్గించుకుని, త్యాగబుద్ధిని అలవాటు చేసుకోవాలి. తాము నష్టపోకుండా ఇతరులకు సాధ్యమైనంత సహాయం చేసేందుకు ప్రయత్నించాలి.

V.V.LLL
15.6.06

మన అతిథి గురించి...

పేరు	:	ప్రొఫెసర్ దుడ్డు రామచంద్రం
పుట్టింది	:	12.6.1946, కక్కిరేణి, రామన్నపేట
విద్య	:	ఎంఎ, ఎల్‌ఎల్‌బి, ఎంఫిల్, పిహెచ్‌డి.
వృత్తి	:	బోధన, వైస్ ఛాన్సలర్, డాక్టర్ బిఆర్ అంబేడ్కర్ ఓపెన్ యూనివర్సిటీ.
నచ్చిన వ్యక్తులు	:	మానవతాదృక్పథం కలిగుండి, పని సంస్కృతి ఉన్న వాళ్లు
నచ్చని అంశం	:	అహంభావం
బలం, బలహీనత	:	సూటిగా మాట్లాడడం
అలవాట్లు	:	సెలవు రోజుల్లో పిల్లలతో గడపడం
అవార్డులు	:	విజయ రతన్ అవార్డు, విద్యాసాగర్ అవార్డు.
ఆదర్శం	:	డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్.

ఈ సంచికలో...

టపా	...	2
టర్నింగ్ పాయింట్	...	4
సలహాలు	...	5
ఇంటి సంగతులు	...	6
క్యాంపస్ ఛాట్	...	10
సినిమా కబుర్లు	...	11
బాలనేస్తాలు	...	12
అట్టమీది కథ	...	14
సెన్సూ కామన్ సెన్సు	...	20

ఇంకా...

ఇలా వుందామా... 7
అవసరం

సీరియల్ 8
తెలుగుగడ్డ

కథ 18
సామాన్యుడి స్వప్నం

ఆరోగ్యం	...	17
టీ బ్రేక్	...	21
మనసా... తెలుసా	...	22
అవీ... ఇవీ	...	23
కొత్త పుస్తకాలు	...	24

చదువుల తీరు...

ఇవాళ్టి పోటీలో తమ పిల్లలు నెగ్గుకురావాలనే తపనతో వాళ్ళను మానసికంగా ఎంతగా ఒత్తిడికి గురిచేస్తున్నదీ కవర్‌స్టోరీలో చక్కగా వివరించారు. ఎప్పుడూ మార్కుల గొడవే తప్ప పిల్లలను ప్రశాంతంగా చదివించాలనే భావన అటు టీచర్లకుగాని ఇటు తల్లిదండ్రులకుగానీ ఉండటం లేదన్నది నిజమే. పోటీలో ముందుండాలంటే ఇదంతా తప్పదుకదా అంటూ సమర్థించుకుంటున్నారు. పోనీ స్కూళ్లలో ఇంతగా రుద్దిచదివిస్తున్నందున మళ్లీ కోచింగులపరుగులుండవా? అంటే అదీ తప్పదు. బలవంతంగా ఇచ్చే ఈ 'శిక్ష'ణ వల్ల భవిష్యత్తులో సాధించేదేమోగానీ మానసికంగా మాత్రం బలహీనమవ్వడం ఖాయం. అయితే ప్రైవేటు స్కూళ్లను ఎండగట్టడానికే రాసినట్టు కాకుండా బ్యాలన్సుచేస్తూ వాటివల్ల కలిగే లాభాలను కూడా వివరిస్తే ఇంకా బాగుండేది.

దేవులపల్లి వెంకట్, ఏటూరునాగారం, వరంగల్.



కొన సాగింపు భలే...

'సినిమాకబుర్లు'లో రాళ్లపల్లిగారు చెప్పిన ముచ్చట్లు బాగున్నాయి. అతని అనుభవాలు కడుపుబ్బ నవ్విస్తున్నాయి. నటనారంగంలో కొత్తగా ప్రవేశించేవారికి డబ్బుకన్నా, క్యారెక్టర్ విలువకే ప్రాధాన్యతివ్వాలని చెప్పడం బాగుంది. యాక్సిడెంటుచేసి ఎవరూ చూడలేదని అవకాశవాదంతో పారిపోకుండా బాధ్యతాయుతంగా వ్యవహరించాలని చెప్పడం ఆదర్శంగా ఉంది.

చంద్రకళ, పెనుబాక, శ్రీకాకుళంజిల్లా.

టీవీ లోకంగా...

తీరిక దొరికితే చాలు నేటి మహిళల్లో, ముఖ్యంగా గృహిణుల్లో టీవీకి అతుక్కుపోయే అలవాటు విపరీతం. దీన్నుదహరిస్తూ మంచి సాహిత్యాన్ని చదివితే తమ అమూల్యమైన సమయం సద్వినియోగమౌతుందని 'మన అతిథి' శీర్షికలో శాంతాదేవిగారి సూచన బాగుంది. ప్రైవేటు స్కూళ్లలో విద్యార్థులనుభవించే మానసిక ఒత్తిడి కవర్‌స్టోరీలో బాగాచెప్పారు. ప్రైవేటుస్కూళ్లలో ఫీజుల గురించి వేసిన కార్టూన్ బాగుంది.

పడాల సాయీశ్వరి, చిత్తూరు.

పేలవంగా...

సెన్సూ కామన్ సెన్సూ శీర్షికలో నిత్యనూతనంగా సాగే రొటీన్ మోసాన్ని చెప్పడం పేలవంగా ఉంది. విశ్లేషణ ఏమీ లేకుండా చెప్తే అది పాఠకుని మనసును ప్రభావితం చేయలేదు. తీసుకున్న విషయమే కాదు, చెప్పే పద్ధతి కూడా ఆసక్తికరంగానూ, ఆలోచనాత్మకంగానూ వుండాలి. ఈ విషయాన్ని రచయిత విశ్లేషించుకుంటే బాగుంటుంది. కథలకోసం వేసే బొమ్మలు బాగుంటున్నాయి. ఆర్టిస్టులకు కృతజ్ఞతలు. కార్టూన్లు కూడా బాగున్నాయి.

మాధవీలత,

సాలూరు, విజయనగరంజిల్లా.

మెరుగైన సమీక్ష

ఎప్పుడో నలభై ఐదేళ్ల కిందట రాసిన 'తొలివలపు' నవలను ఇప్పుడు సమీక్ష చేయడం... పాఠకునిగా దాన్నిప్పుడు చదవడం... అనుభూతిని రాసి పంపడం వింతగా ఉంటుంది కొందరికి. ఇన్నేళ్లయినా పునఃముద్రణ, పునఃసమీక్షకు రావడంలోనే ఆ నవల ప్రత్యేకత అర్థమవుతోంది. ఎప్పుడో ఒకసారి ఆ నవల చదివినా పూర్తిగా మర్చిపోయాన్నేను. ఇప్పుడీ సమీక్ష చదువుతూంటే ఒక్కొక్కటిగా గుర్తొస్తూ మళ్లీ చదివిన అనుభవం కలిగింది. వీరప్రసాద్‌గారు అంత చక్కగా వీరాజీ నవలను సమీక్షించారు. నవలకే హైలైట్‌గా నిలిచిన ద్వితీయ కథానాయిక రాధిక డైలాగ్‌లు సమీక్షలో ఇమడ్చడం నవలానుభూతిని కలిగించాయి. సైన్సు చదువులు సామాజికస్పృహను పెంచలేవని ఆరోజుల్లోనే ప్రతికథానాయిక ద్వారా చెప్పించడం రచయిత దూరదృష్టికి అద్దం పడుతోంది.

డి.కోటి, ఉస్మానియా యూనివర్సిటీ. హైదరాబాద్.

సలహాలు 'ఉచిత'మే...

సలహాలు శీర్షికలో ప్రచురిస్తోన్న న్యాయసలహాలు ఉచితంగా అందుతున్నాయి. మామెలాంటి ఉత్తరాలు రాయకున్నా మిగతా పాఠకులు, కక్షిదారులు రాస్తున్న ఉత్తరాల మూలంగా మాకూ ఆ సమాచారం ఎంతో ఉపయోగకరంగా ఉంటోంది. సైన్సు పాయింటాఫ్ వ్యూలో రాసిన టర్నింగ్ పాయింట్ బాగుంది.

రాజేష్, గోదావరిఖని, ఆదిలాబాద్‌జిల్లా.

ఎలాగుందంటే...

ఈసారి ఇంటిసంగతులు, ప్రమాదం, క్యాంపస్‌ఛాట్ బాగున్నాయి. పుస్తకాల పరిచయాలు రెండూ బాగున్నాయి. వెంకట్రావుగారి 'తుఫాను' వ్యవహారం ఆసక్తికరంగా ఉంది. దానిని మరీ వెనుకపేజీలో పెట్టి న్యాయసలహాలను ముందుంచడం గురించి ఆలోచించాలి. పకోడీలు, రాగివుండలు టెంప్టింగ్‌గా ఉన్నాయి.

శర్మాజీ, జి మాడుగుల, విశాఖపట్నం.

రూ.510/-ల ఇంగ్లీష్ కోర్సు రూ.150/-కే



మొత్తం మూడు డివిజన్ల ప్రత్యేక ఇంగ్లీష్ కోర్స్

డివిజన్-1	డివిజన్-2	డివిజన్-3	
రూ.130/-	రూ.170/-	రూ.210/-	రూ.510/-

రూ.150/-కే

ఇవన్నీ!

డివిజన్-1 ABCD ల నుంచి ఇంగ్లీష్ చదవటం, రాయటం, నేర్పుతూ, ప్రతి ఒక్కరికీ కావలసిన స్థాయిలో స్టాండర్డ్ ఇంగ్లీష్ నేర్పబడుతుంది. ఈ కోర్స్ ఫీజు రూ.130/-

డివిజన్-2 తప్పులు లేకుండా ఇంగ్లీషు రాయుటకు కావలసిన ఆంగ్ల వ్యాకరణం పరిపూర్ణంగా సులభ సూత్రాలతో చాలా ఈజీగా నేర్పబడుతుంది. ఈ కోర్సు ఫీజు రూ.170/-

డివిజన్-3 ఎంతో సులభంగా, ఏ సందర్భంలోనైనా తడబడకుండా, తప్పులు లేకుండా, మంచి నీళ్ళు తాగుతున్నట్లుగా మంచి ఇంగ్లీషు మాట్లాడటం నేర్పబడుతుంది. ఈ కోర్సు ఫీజు రూ.210/-

ఇంగ్లీష్ నేర్చుకోవడం ఇంత ఈజీనా!...

నేను ఒకసారి రైలులో ప్రయాణిస్తున్నాను. నా ప్రక్క సీటులోని వ్యక్తి స్టూడెంట్స్ ఇంగ్లీష్ ఇన్‌స్టిట్యూట్ వారి పుస్తకాలు చదువుతున్నాడు. నేనూ టైంపాస్ కొరకు ఒక బుక్ తీసుకొని చదివాను. అంతే! నాకు ఆశ్చర్యంవేసింది. "ఇంగ్లీష్ నేర్చుకోవడం ఇంత ఈజీనా!..." అనిపించింది. నేనూ పుస్తకాలు తెప్పించుకుని చదివి ప్రస్తుతం నేను చక్కగా ఇంగ్లీష్‌లో మాట్లాడుతున్నాను.

- కె.కమలాకరరావు, విజయవాడ.

ఇదొక డిఫరెంట్ కోర్స్!

డిగ్రీవరకు చదివిన నేను ఇంగ్లీష్‌లో మాట్లాడలేకపోయేవాడిని, నా మిత్రుని వద్ద ఈకోర్స్ బుక్స్ చూశాను. ఇంగ్లీష్ ఫ్లూయెన్సీకి కరక్ట్‌గా ఉపయోగపడే బుక్స్ యివి. 'ఇదొక డిఫరెంట్ కోర్స్' అని నాకు అనిపించింది.

- వి.కె. రాజు, రాజమండ్రి.

కోర్స్ అద్భుతంగా ఉంది!

అవును! ఈ ఇంగ్లీష్ కోర్స్ చాలా అద్భుతంగావుంది. ఎందుకంటే, బాగా చదివినవారికే కాక, కొద్దిగా చదువుకున్న వారికి కూడా అర్థమయ్యేరీతిలో చెప్పిన విధానం చాలా బాగుంది.

-కె.సురేష్, హైదరాబాద్.

ఎక్కడా చూడలేదు

నేను డిగ్రీ వరకూ చదివాను. అయినా ఇంగ్లీష్ మాట్లాడలేక పోయేవాడిని. సులభంగా ఇంగ్లీష్ నేర్చుకోండి అని ప్రకటన చూసి కోర్స్ కొన్నాను. నిజానికి నేను ఇలాంటి కోర్స్ బుక్స్ ఎక్కడా చూడలేదు.

- వై.చంద్రశేఖర్, విశాఖపట్నం.

సులభంగా వుంది

చాలా పుస్తకాలు చూశాను. ఇంగ్లీష్ నేర్పే విధానం ఆ పుస్తకాల్లో అర్థమయ్యేది కాదు నాకు. ఈ కోర్స్ కొని చదువుతుంటే, ఇంగ్లీష్ ఇంత సులభమా అనిపించేంతగా వుంది. చాలా సులభంగా ఇంగ్లీష్ నేర్చుకొన్నాను.

- జె.శ్రీనివాసులు, తిరుపతి.

STUDENTS' ENGLISH INSTITUTE

POST BAG NO.8569, New No. 203, Habibullah Road, (Near: KodambakkamRly. Stn;) T.Nagar, Chennai - 17.

నాకు ప్రస్తుతం రూ.510/-లు విలువగలిగిన ఇంగ్లీష్ కోర్సు కేవలం రూ.150/-లకే వి.పి.పి. ద్వారా పంపించండి. పోస్ట్‌మేన్‌కి పైకం చెల్లించి ప్యాకెట్‌ని తీసుకుంటానని హామీ ఇస్తున్నాను.

3728

Name: ....

Address: ....

....

....

....

.... Pincode

టర్నింగ్ పాయింట్

వకుళాభరణం రామకృష్ణ

నీలిమందు తిరుగుబాటు

1857 సిపాయిల తిరుగుబాటు భారతదేశ చరిత్రను ఎలా మలుపు తిప్పిందన్న వైనాన్ని ఇంతకుముందు తెలుసుకున్నాం. ఆ తిరుగుబాటు తలెత్తిన విద్యావంతుల మధ్యతరగతి వర్గం, 1857 తిరుగుబాటుకు పూర్వం ఆంగ్లేయ పాలనను సమర్థించింది. ఆంగ్ల పాలకులు సంస్కరణలు ప్రవేశపెట్టి దేశాన్ని ఆధునికీకరణద్వారా అభివృద్ధి చేస్తారని నమ్మింది. 1857 తర్వాత, ఎప్పుడైతే వలస పాలకులు, దేశంలోని భూస్వామ్య, స్వార్థపర, స్వదేశీ సంస్థానాధీశులతో చేతులు కలిపి అపవిత్రకూటమిగా ఏర్పడ్డంతో, మేధావివర్గం దాన్ని గమనించి, ఆంగ్ల పాలకులపై వారు పెట్టుకున్న ఆశలను వదులుకున్నది.

ఈ నేపథ్యంలో, 1860లో నీలిపితూరిగా (బ్లూ మ్యూటినీ) ఆంగ్లేయులు చిత్రించిన నీలిమందు తిరుగుబాటు బెంగాల్‌లో జరిగింది. ఇది నిఖార్సయిన రైతాంగ తిరుగుబాటు. రైతాంగం వ్యాపించాయి. ఆంగ్ల పాలనలో విసిగిపోయి బాధలననుభవిస్తున్న ప్రజల్లో సంచలనం పుట్టుకొచ్చింది. అప్పటికే బెంగాల్లో బ్రహ్మసమాజం, యువ బెంగాల్ ఉద్యమాలు ప్రజల్ని ఉత్తేజపరుస్తున్నాయి. కలకత్తాలోని మేధావులు నీలిమందు తిరుగుబాటుకు తమ సంఘీభావాన్ని బహిరంగంగా ప్రకటించారు. కలకత్తా నగరంనుండి వెలువడుతున్న పత్రికలకు, తాము తిరుగుబాటు జరుపుతున్న ప్రాంతాలకు వెళ్ళి చూసిన వాస్తవాలను రైతుల కడగండ్లను, తిరుగుబాటు వివరాలగూర్చిన వార్తలను పంపారు. అవి ప్రచురించాక బెంగాల్లో ప్రజాభిప్రాయం తిరుగుబాటుకు అనుకూలంగా మలచబడింది. తిరుగుబాటుకనుకూలంగా ఒక

ప్రధానంగా సార్వభౌమాధికారాన్ని కోల్పోయిన స్వదేశీ రాజ్యాలు జరిపినది. సంప్రదాయరీతిలో జరిగిన ఆ తిరుగుబాటులో ఆంగ్లేయులచే బర్తరఫ్ కాబడ్డ సిపాయిలు, అక్కడక్కడా సామాన్యప్రజలు పాల్గొన్నారు. ఆ కోవలో జరిగినవే సన్యాసుల తిరుగుబాటు (బెంగాల్), దక్షిణ భారతదేశంలోని పాలెగాళ్ళ తిరుగుబాట్లు. అప్పటికి జాతీయతాభావం దేశంలో మొదలవలేదు. ఆంగ్లేయుల వ్యతిరేక తిరుగుబాట్లుగా మాత్రమే వాటిని పరిగణించాలి.

కానీ, 1857 తర్వాత ఆధునిక భారతదేశ చరిత్ర గమనంలో పెనుమార్పు పొడచూపింది. ఈ మార్పును రెండు అంశాల్లో గమనించవచ్చు. ఒకటి, 1857 తర్వాత జరిగిన తిరుగుబాట్లు కేవలం ఆంగ్లేయులకు వ్యతిరేకమైనవేకావు. వారి ఆర్థిక విధానాలకు వ్యతిరేకమైనవి. వారి దోపిడీని నిరసించినవి. వాటిలో ఆర్థికాంశం ముఖ్యం. జాతీయ భావజాలం ఆర్థికదోపిడీని వ్యతిరేకించడంతోనే ఆరంభమైంది. భారతీయుల ఆర్థిక ప్రయోజనాలు, ఆంగ్లేయుల దోపిడీతో ఘర్షణ చెందినపుడే భారతీయుల్లో జాతీయతాభావం అంకురించింది. ఇక రెండో మార్పు- దేశంలో సంఘటితం చెంది ఏకైక శక్తిగా ఆంగ్లేయులకు, వారి తాబేదార్లయిన జమీందార్లకు, కాఫీ, టీ, నీలిమందు తోటల యజమానులకు, వడ్డీ వ్యాపారులకు వ్యతిరేకంగా సమీకృతమైంది. నీలిమందు తాలూకు నిరసన బెంగాల్లో 1859లోనే ఆరంభమైంది. నీలిమందు ఉత్పత్తిపై ఐరోపావాసులకు గుత్తాధిపత్యం ఉండేది. నీలిమందు తోటల యజమానులు విదేశీయులు. కానీ, నీలిమందు సాగుచేసే భారతీయ రైతులను కట్టుబానిసలకంటే హీనంగా చూసేవారు. ఇష్టమున్నా, లేకున్నా.. సాగులో ఫలసాయం చేతికి అందక పోయినా, నానా బాధలూ పడుతూ చిత్రహింసలు భరించి నీలిమందు సాగుచేయాలి. దీన్ని ప్రతిఘటించేందుకు రైతాంగం ఆయత్తమైంది. వేలాదిమంది రైతులు, తమ భూములను బీడు బెట్టి సాగు నిలిపేశారు. తోట యజమానులు వినియోగించిన కిరాయి సైన్యాల దురాగతాలను రైతులు ధైర్యంగా ఎదుర్కొన్నారు.

తిరుగుబాటు ఊపందుకుంది. బెంగాల్ రాష్ట్రమంతటా తిరుగుబాటు వార్తలు దావానలంలా సమాంతర ప్రజాఉద్యమం బెంగాల్లో పెల్లుబికింది.

ఈ ఘటనతో ఆంగ్లేయ వ్యతిరేకత గణనీయమైన మార్పుకు లోనయింది. ప్రజావెల్లువకు నాందిగా నిలిచింది. ఈ తిరుగుబాటు సందర్భంగా రైతాంగ పరిస్థితులను వర్ణిస్తూ 1860లో దీనబంధు మిత్ర అనే బెంగాలీ నాటకకర్త 'నీల్ దర్పణ్' అనే నాటకాన్ని రచించాడు. తిరుగుబాటు ప్రాంతాల్లో కాకుండా బెంగాల్లో అనేక ప్రాంతాల్లో ఈ నాటక ప్రదర్శన జరిగి, విదేశీ తోటల యజమానుల దురంతాలను బట్టబయలుచేసింది. ఆంగ్లంలోకి ఈ నాటకాన్ని జేమ్స్ లాంగ్ అనువదించగా దాన్ని నిషేధించి అనువాదకుణ్ణి ప్రభుత్వం శిక్షించింది. ప్రజానమస్యలకు సాహిత్యం బలంగా స్పందిస్తుందనడానికి ఇది ప్రబలనిదర్శనం. నీలిమందు తిరుగుబాటు రైతాంగానికి, విద్యాధిక వర్గానికి మధ్య వారధి నిర్మించి, సమాజంలోని ఈ రెండు ప్రధాన పాయల ఐక్యత, ప్రజా సమస్యల పరిష్కారానికి మార్గమని సూచించింది.

*

సవరించుకునే మార్గం తెలియజేయండి

నా పేరు ఆంజనేయులు. ప్రస్తుతం బిఇడి పూర్తి చేశాను. డిఎస్ఇ రాయబోతున్నాను. డిఎస్సిలో స్టడీ సర్టిఫికెట్‌ను 4వ తరగతి నుండి అడుగుతారని తెలిసి నేను 1 నుండి 5 వరకూ చదివిన స్కూల్‌కి వెళ్ళి స్టడీ సర్టిఫికెట్‌ను అడిగితే 'నీ పేరు అంజప్పగా నమోదై వుంది, అలాగే ఇస్తానని' అన్నారు. 'సవరించి ఇవ్వండి సార్' అని ప్రాధేయపడినప్పటికీ ఇవ్వలేదు. కానీ 6 నుండి బిఇడి వరకు కూడా ఆంజనేయులు అనే పేరు వుంది. కాబట్టి కోర్టు ద్వారా ఆ పేరును సవరించే మార్గం వుంటే తెలియజేయమని ప్రార్థిస్తున్నాను. నేను వికలాంగుడను. చదువే ఆధారం కాబట్టి ఈ సమస్యకు పరిష్కారం తెలియజేస్తారని ప్రార్థిస్తున్నాను. ఎడ్మిషన్ రిజిస్టర్‌లో నెంబర్, తండ్రి పేరు, కులము - అన్నీ బాగానే వున్నాయి. కేవలం పేరు మాత్రం అలా వుంది. దయచేసి ఈ సమస్యకు పరిష్కారం తెలపండి.

ఆంజనేయులు

జి.ఎల్.నరసింహారావు
హైకోర్టు న్యాయవాది

మీరు ప్రాథమిక విద్యనభ్యసించినపుడు ముద్దు పేరుగా అలా రాయించి ఉంటారు. కాని మీకు సర్టిఫికెట్ ఇచ్చేటప్పుడు రాసి ఉన్న పేరు మీరు 6వతరగతిలో ప్రవేశించిన పేరు అయి ఉండాలి కదా! 6వ తరగతిలో ప్రవేశమే మీ 10వ తరగతిలోను సర్టిఫికెట్లలో ఆ పేరు వచ్చి ఉండాలి.

ఏదేమైనా మీరు ప్రాథమిక పాఠశాలలో ముద్దు పేరుగా అలా పిలిచేవారని అదే పేరు రికార్డులో ఉందని, అసలు పేరు ఆంజనేయులు అని, మీ మిగతా సర్టిఫికెట్లు ధృవీకరిస్తున్నాయి. కనుక ఆంజనేయులు అనబడే మిమ్మల్ని అంజప్ప అని చిన్నప్పుడు పిలిచేవారని ఆ రెండు పేర్లూ మీవేనని, మీ నాన్నగారికి అంజప్ప అనే ఇంకో కుమారుడు లేడని మీరు , మీ తండ్రిగారు నోటరి ముందు లేదా మెజిస్ట్రేట్ ముందు అఫిడవిట్ ఇవ్వవలసివుంటుంది. ఆ అఫిడవిట్ మీ అధికారులకు చూపిస్తే సరిపోతుంది.



ఇంటి సంగతులు

బస్సు-భక్తి

ఇంద్రగంటి జానకీబాల

బస్సు ఎప్పుడొస్తుందా అని ఎదురుచూస్తున్నాను. ఎక్కడికైనా వెళ్లాలంటే కేటాయించుకున్న సమయం మొత్తం బస్ స్టాపుల్లోనే గడిచిపోతుంది. ఈ మహాపట్నంలో ఎక్కడికి వెళ్లాలన్నా, రెండుమూడు బస్సులు మారాలి. అన్నిదారులూ రోమ్ నగరానికెళతాయన్నట్లు ప్రతి బస్సూ సికింద్రాబాద్‌కైతే వెళ్తుంది. అక్కడినుంచి మనమెక్కడికెళ్లాలంటే అక్కడికి వేరే బస్‌లో వెళ్లాలి. ఇలా నింద వేస్తే ఆర్.టి.సి. వారేం ఊరుకోరు. ప్రతి కాలనీ నుంచీ, ఏరియా నుంచీ కొన్ని ముఖ్యమైన చోట్లకి నేరుగా బస్సులున్నాయని వాదిస్తారు. అందులో కొంత నిజం లేకపోలేదు. కానీ అవి ఉదయం పద్ధిలోపల ఆఫీసుకెళ్లేవాళ్లకే పనికొస్తాయి. ఏదేమైనా ఎన్ని బస్సులు మారైనా గమ్యం చేరాలని నిర్ణయించుకునే అక్కడ నిలబడ్డాన్నేను.

మనం ఊహించనివి జరిగినప్పుడే కదా థ్రిల్. నాకు కావలసిన ఏరియాకి నేరుగా పోయే బస్సు రావడంతో ఆశ్చర్యంతో అవాక్కయిపోయాను. దెబ్బమీద దెబ్బలాగా అది స్త్రీలకి మాత్రమే(లేడీస్ స్పెషల్) కావడంతో నిజంగా నేను ఆడజన్మెత్తినందుకు గర్వపడ్డాను.

గబగబా ఎక్కాను. నాతోబాటే రెండు పట్టుచీరలు కూడా ఎక్కాయి. లోపలికెళ్ళి చూసేసరికి అది ఉద్యోగినులకోసం వేసిన బస్సులాకాకుండా ఒక పెళ్లివారి బస్సులా ఉంది. అందరూ మడికట్టుకుని ఆఫీసులకి బయలుదేరారా... అనిపించింది.

ఆ బస్ మా స్టాప్‌కంటే రెండుస్టాప్‌ల ముందే బయలుదేరుతుంది. ఆ వేళేదో పర్వదినమో ఏమో... నాకు గుర్తురాలేదుగానీ చాలామంది పట్టుచీరలే కట్టుకున్నారు. మిగిలినవాళ్లు అదేవిధంగా ఉండే ఇమిటేషన్ చీరలు కట్టారు. ప్రతివారినుదుటిమీదా మూడునాలుగు బొట్లున్నాయి. రెండుకు తగ్గినవారు లేరు. ఒకావె తలంటుకుందనుకుంటా... తువ్వాలు పిడపతో బస్సెక్కేసింది. మరొకామె జుట్టువిప్పి చిక్కుతీసుకునే

ప్రయత్నంలోపడింది. నేను చుట్టూ కలియచూశాను. నా చీర, నా వాలకం చూసి పక్కవాళ్లు ఆత్మీయంగా నవ్వి, తాము సర్దుకుని కాస్త చోటిచ్చారు. ఆ కాస్త జాగాలో సర్దుకుని కూర్చుని క్షణం కాలేదు, 'ఓం' అని వినిపించింది. ఒక కంఠం మొదలుపెట్టిందో లేదో పదీ... ఇరవై కంఠాలు దానితో కలిశాయి.

'ఏకదంతం మహాకాయం
తప్తకాంచన సన్నిభం
లంబోదరం విశాలాక్షం
వందేహం గణనాయకం...' అంటూ

ముక్తకంఠంతో అందరూ భక్తిపారవశ్యంతో చదవడం మొదలుపెట్టారు.

'చిత్ర రత్న విచిత్రాంగం
చిత్రమాలా విభూషితం
కామరూప ధరం దేవం
వందేహం గణనాయకం...'

కండక్టరు నిశ్శబ్దంగా, పరవశంగా ఒకటీఅరా టిక్కెట్లు ఇస్తున్నాడు. ఎందుకంటే అక్కడన్నీ పాస్‌లూ... సీజన్ టిక్కెట్లూ...

ఒకరిద్దరు చివరిసీట్లో కూర్చుని కిటికీలోంచి బయటికి చూస్తుండటం గమనించాను. కానీ నా చుట్టుపక్కలవారందరూ కళ్లుమూసుకుని ఒక్కొక్క అష్టకం గట్టిగా చదివేస్తున్నారు.

'అధరం మధురం... వదనం మధురం...'

'హరిగిరి నందిని... నందితమోహిని...'

'సర్వేశ్వరాయ... '

'బ్రహ్మమురారి సురార్చితలింగం...' అంటూ సకల దేవతల్నీ పూజించి వదిలిపెట్టారు.

నా ఆశ్చర్యానికి అంతు లేకుండాపోయింది. భక్తి, మతం అనేవి చాలా వ్యక్తిగతంగా, ప్రైవేట్‌గా ఉంటాయి. ఉండాలి కూడా. మరి ఇదేం పద్ధతి అనిపించింది. వారంతా బాగా చదువుకున్నవారే. ఆ విషయమే ప్రస్తావిస్తే 'చదువుకుంటే భక్తి ఉండకూడదా?' అనడిగిందొకామె.

'ఉండకూడదని ఎలా అంటాం? కాకపోతే సమూహంలో ఉండేప్పుడు పక్కవారి గురించి ఆలోచించాలికదా!'

'పక్కనెవరూ లేరే?!'

'ఉంటారు. కానీ మనం ఎక్కువ మందిమి ఉంటాం. మనమాట ఎక్కువ చలామణి అవుతుంటుంది. తక్కువమందిముంటే అదొక ప్రత్యేకాంశంగా డిమాండ్‌కొచ్చేది. అంతే...'

'ఏ మతమైనా మనవల్ల చుట్టూవున్నవారికి ఇబ్బంది కలిగించకూడదనేది కనీస ధర్మం'

'మనవాళ్లే మనల్ని ఆక్షేపిస్తారండీ...' అంటూ ధ్వజమెత్తుతారు.

'మనవాళ్లకే ఈ సెక్యులరిజం గోల...' అని దులిపిమరీ వదిలిపెట్టారు.

బస్సు దిగేటప్పటికి చెవులకు పట్టిన తుప్పు వదిలినట్లయి, 'హమ్మయ్య' అనుకున్నాను.

*

హు... ప్రజలు

నన్ను గెలిపిస్తే
సముద్రంలో పంచదార కలిపి
మంచినీటి కొరత తీరుస్తానని
వాగ్దానం చేశాడో నాయకుడు
వాణ్ణి గెలిపించారు ప్రజలు
హు... ప్రజలు

- జె.కె. భారవి

ఇలా వుందామా...

వి. నాగరత్న

అవసరం

తో చీతోయనమ్మ తోటికోడలి పుట్టింటి కెళ్ళిందని మనకో సామెతుంది. అలాగే ఏ టీ బ్రేక్‌లోనో, పవర్‌కట్‌వల్ల గోళ్ళు గిల్లుకోడానికి మించి మరేం చేయలేనప్పుడో కాస్త సరదాగా వుండేవాళ్ళతో మాట్లాడ్డం నాకలవాటు. అలాంటివాళ్ళపై ఏదో తుంటరిప్రశ్నేసి 'ఏం చెప్తారో చూద్దాం' అనుకుంటాను. అలాంటి సందర్భంలో పక్కసీట్లో కూర్చున్న సినిమాపేజీ చందూగార్ని "మీరు దేవుణ్ణి నమ్ముతారా?" అనడిగాను. కొంటె జవాబుకోసం మూతి బిగపట్టి చూస్తోంటే "నమ్ముతాను, మొక్కుకుంటాను కూడా" అనే సమాధానం రావడంతో 'హూ...' అంటూ ఓ గాట్టి నిట్టూర్పు నాకు తెలీకుండానే వచ్చేసింది.

అతను తాపీగా "వంద కొబ్బరికాయలు కొడతాను, వెయ్యినూట పదహార్లు నమర్పించుకుంటాను లాంటి మొక్కులు కాదు... ఎంతోకొంత ఎమౌంటనుకుని, దాన్ని మావాడిపేర పేదవాళ్ళకి పంచుతాను.. ఎవరికిపడితే వాళ్ళకివ్వను, ముసలీముతకా, కళ్ళూకాళ్ళూలేని.. అలాంటి డబ్బు అవసరం ఉన్నవాళ్ళని వెతికిపట్టుకుని ఇస్తాను, అది నిజంగా కష్టమే" అంటోంటే నాక్కాస్త ఆశ్చర్యమేసింది. ఎప్పుడు చూసినా ఛలోక్తులు విసుర్తూ, జీవితాన్ని తేలిగ్గా తీసుకున్నట్లు కనిపించే ఇతనికి ఇంత మంచి ఆలోచన్లున్నాయా అన్పించింది.

* * *

ఒకసారి డైరెక్టర్ తేజాగారితో మాట్లాడినపుడు కాసేపు మామూలు మాటలయ్యాక అనాథపిల్లల ప్రస్తావన రావడంతో చాలా ఆర్ద్రంగా మాట్లాడారు. అలాంటి చిన్నారులకు తనకు చేతనైన సాయం చేస్తుంటారని తెలిశాక బాగా గౌరవం కలిగింది. ఆయన సినిమాలు కమర్షియల్ కావచ్చు గానీ మనసు మాత్రం ఆర్ట్‌మూవీ అన్పించింది.

* * *

మనకు బిచ్చగాళ్ళ కొరతేంలేదు. రోడ్డుమీద నడుస్తోన్నా, ఏ కొట్టుదగ్గరో ఆగినా 'నీకు పుణ్యముంటుంది, దానం చెయ్ తల్లీ' అని చేయి చాస్తుంటారు. కొన్నిసార్లు కూరకో, చారుకో పోపు వేస్తున్నప్పుడో, స్నానం చేస్తున్నప్పుడో ఆగకుండా కాలింగ్‌బెల్ మోగుతుంది. 'అతిథుల్ని దేవుళ్ళంటారుగానీ, నిజంగా దెయ్యాలే... బెల్లెలా కొట్టాలో కూడా తెలీదు' అని తిట్టుకుంటూ వెళ్ళి తలుపు తీస్తే తీరా కనిపించేది యాచకప్రభువులు. ఇకప్పుడు చూస్కో ఎంత శాంతమూర్తికైనా గుండ్రాయి తీసుకుని నెత్తిన మోదాలనిపిస్తుంది. ఓసారలాగే 'స్నానం కూడా సరిగ్గా చేసిచావనీయలేదనే' ఉక్రోషంకొద్దీ 'బెల్లు కొట్టిమరీ పిలుస్తావా?' అంటే 'తలుపు కొట్టొద్దనే కదమ్మా బెల్లు పెట్టించుకున్నారు' అని కూల్‌గా బదులిచ్చాడు యాచకోత్తముడు. 'నేనివ్వను ఫో' అంటే 'నేను బ్రాహ్మణ్ణి, ఒట్టిచేతుల్తో పంపితే నీకే మంచిది కాద'ని బెదిరించాడు. అంతకుమించి శాపం తగులుతుందని బెదిరించేవాళ్ళు కూడా వున్నారు. ఆ చెత్తకు భయపడి కాదుగానీ తిట్టుకున్నందుకైనా పరిహారం చెల్లించాలి కదాని ఓ పదిచ్చి పంపేశాను.

అయితే ఒకటి మాత్రం నిజం. పనిచేయడం ఇష్టంలేని బాపతు కొందరు అడుక్కునేందుకు సిద్ధపడుతున్నారు. అలాంటివాళ్ళకి డబ్బు రూపంలోనో, వస్తురూపంలోనో దానమివ్వడం ఒకరకంగా వాళ్ళనా దుస్థితిలోనే ఉంచేయడమౌతుంది. అంటే పరోక్షంగా వాళ్ళని ఎంకరేజ్ చేస్తున్నట్లు. ఇలా అంటున్నంతలో బిచ్చగాళ్ళపట్ల నాకెంతమాత్రం చిన్నచూపులేదు. ఎండనక, వాననక రోడ్లెమ్మట పడి తిరగడం, ఛీ,ఫోమని తిరస్కరిస్తే బాధపడటం కంటే కష్టమైందా పని?! అనారోగ్యమో, వృద్ధాప్యమో, పోషకులేమోవల్ల అడుక్కోవలసివస్తే ఎవరూ తప్పు పట్టరు. అలాంటివారిని చూస్తే మనసు ద్రవిస్తుంది కూడా. వాళ్ళకి చేయూత అందించాల్సిన అవసరమూ వుంది. కనుక బద్ధకిస్టులైన భిక్షువులకు ఏమీ ఇవ్వకపోయినా నష్టంలేదు. నిరాధారులైన, నిస్సహాయులైన అభాగ్యులకు మనకు చేతనైంది ఇవ్వడం మన ధర్మం. ఆ కాస్త సాయానికి మన సొమ్ములేం కరిగిపోవు. ఆపదలో ఉన్నవారిని ఆదుకోవడంకంటే మించిన గొప్ప విషయం ఇంకోటిలేదు.

ఓ మంచి లక్షణం ఎవర్లో వున్నా చూసి నేర్చుకోవాలి. అందుకోసం ప్రయత్నించాలి. మరి మనం కూడా ఇకపైన మిస్టర్ చందూలా మొక్కుకుందామా? వీలున్నప్పుడు తేజాగారిలా ఏ అనాథాశ్రమానికో, వృద్ధాశ్రమానికో వెళ్ళి మనకున్నంతలో ఏమైనా ఇచ్చొద్దామా?! *

సీరియల్

గొల్లపూడి నారాయణరావు

(పెళ్ళికిముందు వంకాయలమ్ముకునేందుకు వచ్చినపుడు తనతో అకారణంగా గొడవకుదిగి, ఆ తర్వాత కూడా కోపాన్ని ప్రదర్శించిన షాయిరీ జవాను ఉన్నట్టుండి క్షమాపణ కోరుతూ పలకరించడం ప్రతాపరెడ్డిని ఆశ్చర్యానికి గురిచేస్తుంది)

(23 వ భాగం)

"ఇటురా అబ్బాయి మా ఇల్లు చూసి వెళ్దువుగానీ" అన్నాడు పట్వారీ. ప్రతాప్ ముఖం ఇబ్బందిగా పెట్టి "మావయ్య మాగాణిదగ్గరికి త్వరగా వెళ్లాలన్నారండీ" అన్నాడు.

"ఇప్పుడే వెళ్లిపోదువుగాని రా అబ్బాయ్, ఇంతలో మించిపోయిందేముంది?" అన్నాడు పట్వారీ.

ప్రతాప్‌కిక తప్పనిసరి అయింది. లోపలికి నడిచాడు. పట్వారి ముందుకు వెళ్లి సావిడిలోనున్న బల్లపై దుమ్ము దులిపాడు.

"కూర్చో అబ్బాయ్" అన్నాడు.

ప్రతాప్ బల్లపై కూర్చున్నాడు. అతడి పక్కనే బల్లపై పట్వారీ కూడా కూర్చున్నాడు.

"రాత్రివాళ్లు తోపంతా శుభ్రంగా నరికివేశారు. నీకు తెలిసిందా?" అన్నాడు. "షాయిరి నాకాకూడా కొట్టారటగదూ?" అనడిగాడు తిరిగి.

"అవునటండీ, అందరూ అంటున్నారు" అన్నాడు ప్రతాప్.

"అది సరేగానీ, నీకొక మాట చెప్పాలనుకున్నాను"

"చెప్పండీ"

"నేను కరణీకానికి రాజీనామా పెడ్దామనుకుంటున్నాను"

ప్రతాప్ ఆశ్చర్యపోయి "నిజంగానే అంటున్నారా?" అన్నాడు.

"నిజమేనబ్బాయ్. గ్రామాధికారులు ఉద్యోగాలకు రాజీనామాలివ్వాలని మొన్నీమధ్య మీ సంగం నాయకుడు ఒక వార్తను పత్రికలో ప్రకటించాడు. అప్పటినుండి దీన్ని ఆలోచిస్తున్నాను"

"అట్లా అయితే ఇంకా ఆలోచనెందుకూ? రాజీనామా వెంటనే దాఖలు చేయండి"



"నాకు తెలియక అడుగుతాను, నా రాజీనామాను ఎవరికి పంపాలంటావు?"

"ఒక కాపీ సర్కారీకి, ఇంకొకటి సంగంవాళ్ల పత్రికకు అందజేయండి"

"నీవు చెప్పిన సలహా బాగుంది. ఇవ్వాళే రెండు కాపీలు రిజిష్టర్ చేయిస్తాను. కానీ ఆ రాజీనామా కాగితాలెలా రాయవలసిందీ కాస్త చెప్పి వెళ్లు"

"మళ్లీ వస్తాను. ఇంతలో మించి పోయిందేముంది? సాయంత్రం కూర్చుని రాద్దాంలెండి" అన్నాడు. "ఇక వెళ్తానండి. మాగాణిలో పనుంది" అన్నాడు తిరిగి.

"సరే వెళ్లు. సాయంత్రం మట్టుకు తప్పకుండా రావాలి సుమా" అన్నాడు పట్వారి.

ప్రతాప్ "అలాగేలెండి" అంటూ బజారుకు వచ్చేశాడు. అతడు సరాసరి మాగాణి వద్దకొచ్చాడు. కాలువ అంతా తమ మాగాణిలోకే వస్తోంది. అది చూసుకుని తూర్పుపంపులో నాటు వేస్తున్న కూలీల వద్దకు వెళ్తున్నాడు. అంతలో అక్కడ అరక దున్నుతున్న యాదవరెడ్డి పిలిచాడు.

దాంతో ప్రతాప్ నిలబడిపోయాడు. "అరక దున్నుతున్నావు గదా, అక్కడికి నేనెందుకూ?" అన్నాడు.

"అరకనం ఆపుతున్నాలేరా, కాసేపు కూర్చుని మాట్లాడుకుందాం" అన్నాడు యాదవరెడ్డి.

ప్రతాప్ యాదవరెడ్డి అరక వద్దకెళ్లాడు.

యాదవరెడ్డి అరక ఆపి వచ్చాడు. ఇద్దరూ గెనెంమీద కూర్చున్నారు.

"గ్రామంలో విశేషాలేమిటి ప్రతాప్?" అనడిగాడు యాదవరెడ్డి.

"నీవు గ్రామంలో ఉండడంలేదూ?" నవ్వుతూ అన్నాడు ప్రతాప్.

"ఈ నాట్లువేసే నాలుగురోజులూ తీరికెక్కడిది?" చీకటితోనే రావడం, చీకటి పడేవరకు ఇక్కడే ఉండడం గదా? అందుకని అడుగుతున్నాను"

"రాత్రి మన ఊరి మొగలో తాళ్లు కొట్టేశారు. అది తెలుసా?"

"తెలుసులే" అంటూ నవ్వాడు యాదవరెడ్డి.

"రాత్రే షాయిరి నాకాపై దాడి జరిగింది"

"అదీ తెలుసును"

"అయితే ఇంకోవార్త. మన గ్రామ పట్వారి ఉద్యోగానికి రాజీనామా పెడుతున్నాడు"

"అదీ నాకు తెలుసయ్యా ప్రతాప్. ఆయన నన్ను పిలిచి మరీ చెప్పాడు రాజీనామా పెడతానని"

"పట్వారీ చాలా అసాధ్యుడు సుమా"

"ఎంత చెడ్డా కరణం కదూ? తెలివిగల పురుగు"

ఇద్దరూ నవ్వుకున్నారు. రెండు క్షణాలు నిశ్శబ్దంగా గడిచిపోయినాయ్. తర్వాత ప్రతాప్ తిరిగి మాట్లాడాడు.

"యాదవ్, ఇవ్వాళ వేకువజామునే రాజారెడ్డిగారు వచ్చిపోయారు"

"అరే నాకు తెలియనే తెలియదే?"

"రాత్రి ఆయన ఆధ్వర్యంలోనే తాళ్లు నరకడం, నాకా కొట్టడం ఈ రెండు పనులూ జరిగిపోయాయి"

"అట్లాగా?" అన్నాడు యాదవ ఆశ్చర్యంతో.

"ఇక్కడ త్వరలో నాట్ల పనులు తీర్చుకుని దళం ఏర్పాటు చేసుకుని కార్యోన్ముఖులు కావాలని మరీమరీ చెప్పెళ్ళాడు"

"ఇంకా ఏమని చెప్పారు?"

"అన్నట్లు మరిచిపోయాను. రాత్రి నాకాపై దాడి జరిగినపుడు రెండు తుపాకులు దొరికాయట. మనం దళాన్ని నిర్మిస్తే అందులో మనకొకటి ఇస్తామని అన్నారు"

ఆ మాటలతో యాదవరెడ్డి దేహం పులకరించింది. అతడు తుపాకీ గురించి, దాన్ని గురిపెట్టి కాల్చడం గురించి ఊహ సలుపుతున్నాడు.

"యాదవా, ఇంకొక రహస్యమైన మాటుంది" అన్నాడు ప్రతాప్.

"ఏమిటది ప్రతాప్?" అన్నాడు యాదవరెడ్డి.

"ఈ రాత్రికే తిరిగి రాజారెడ్డిగారు దళంతో మన గ్రామం వస్తున్నారు"

"మళ్లీ ఎందుకూ?"

"పటేలు, పట్వారీ దస్త్రాలు తీసుకోవడానికి"

యాదవరెడ్డి తల ఊపాడు.

ప్రతాప్‌లేచి నిల్చున్నాడు. "కూలీలు నాటు వేస్తున్నారు.. వెళ్తాను యాదవా" అన్నాడు. అక్కడినుండి సూటిగా కూలీలు నాటు వేస్తున్న పొలం వద్దకు నడిచాడు.

అప్పటికే బాగా చీకటి పడింది. నాటుకు వెళ్లిన శాంతమ్మ చలిజ్వరం పుట్టి వణుకుతూ ఇంటికొచ్చింది. నట్టింట మంచం వాల్చుకుని దానిపై అడ్డంగా పడిపోయింది.

కాసేపటికి పటేలు ఇంటికొచ్చాడు. భార్య వద్దకుపోయి చూశాడు. "ఏమిటే పడుకున్నావూ?" అనడిగాడు.

"చలిజ్వరం ముంచుకొచ్చిందయ్యా. దండేన దుప్పటితెచ్చి మీద పడే యవయ్యా" అంటూ రాగాలు పెట్టింది.

అతడు నిట్టూరుస్తూ దండెంమీది దుప్పటి తెచ్చి ఆమెపై నిండుగా కప్పాడు. అక్కడే నిలబడిపోయాడు. ఆపూట చేతిపైకి ముద్దలేచే ఉపాయమేమిటా అని ఆలోచనలో పడిపోయాడు. అంతలోనే ఆమె ముసుగులో ఉండి మాట్లాడింది.

"పొద్దుటి కూడు చానా ఉందయ్యా. బీరువాలో చింతకాయ పచ్చడుంది. ఉట్టిమీది చట్టిలో పేరినెయ్యి ఉంది. ఈ పూటకు వాటితోనే అబ్బాయి, నువ్వూ సరిపుచ్చుకుని తినండయ్యా" అందామె రాగాలు తీస్తూ. మధ్యమధ్య మూలుగులు కూడా పెట్టింది.

ఆ పూటకు చేయి కాల్చుకొనవలసి వస్తుందనుకున్న పటేలు విచారం ఆమె మాటలతో మటుమాయమైపోయింది. కానీ, అంతవరకూ ఇంట్లో దీపం వెలిగించకపోవడంతో ఇల్లంతా కటిక చీకటిగా ఉంది.

"అబ్బాయ్ గజ్జెలూ" అని పిలిచాడు. సందునుండి గజ్జెలరెడ్డి వచ్చి "ఏమిటయ్యా?" అన్నాడు.

"ఏం చేస్తున్నావక్కడ?"

"గాబుల్లో నీళ్లు పోస్తున్నానయ్యా"

"పనోళ్లేమయ్యారు?"

"ఇళ్లకెళ్లారు కాబోలు"

"ఆరి, వీళ్ల తల్లి ముండమెయ్య. ఏం ఏడిపిస్తున్నార్రా? సరే నీళ్ళు తర్వాత పోద్దువుగాని ముందుగా కాస్త దీపాలు తుడిచి వెలిగించు" అన్నాడు.

"అమ్మలేదూ?"

"అది లేవలేదులే.. రా, వెలిగించు" అన్నాడు పటేలు.

గజ్జెలరెడ్డి లాంతర్లు తెచ్చి ముందేసుకున్నాడు. పటేలుముందు వరండాలో మంచం వాల్చుకుని పడుకున్నాడు.

తాను పటేలుగిరికి వచ్చిన కొత్త రోజులవి. గ్రామపెద్ద కొలువు ప్రారంభించారు. కొలువు సంబరాలకోసం ఇంటింటికీ చందాలు వేశారు. ఆ చందా అడిగే నిమిత్తం గ్రామ పెద్దలు అతడింటికొచ్చారు. చందా ఇవ్వబోనని చెప్పాడు. దాంతో వాగ్వివాదం పెరిగింది. గ్రామ పెద్దలు అతడి చందా వసూలు చేయాలనే పట్టుదలకొచ్చారు. గ్రామ పెద్దకాపు అయిన కోదండరాంరెడ్డి తండ్రి దశరథరాంరెడ్డిని తీసుకొచ్చారు. ఆయన "అబ్బాయీ, మనుషులకొచ్చిన జబ్బు నివారించడంకోసం ఈ కొలువు ప్రారంభించాం. మనుషులవారీగానే చందా వేశాం. పెద్దవాణ్ణి చెబుతున్నాను. ఇవ్వడం మంచిది, ఇచ్చేయి" అన్నాడు.

అప్పటికాయన మాట కాదనలేక చందాలిచ్చిపంపాడు పటేలు. కాని తనదగ్గర చందా వసూలు చేశారనే ఉక్రోషంతో అప్పటికప్పుడే టౌనుకెళ్లాడు. సరిగా కొలువు నాటికల్లా పోలీసు అమీనాను తీసుకొచ్చాడు. తప్పతాగి దబుకులవాళ్ల ముందు చిందులేస్తున్న వారందరూ హఠాత్తుగా వచ్చిన పోలీసు ఫౌజును చూసి ఎక్కడివాళ్లక్కడే పిల్లుల మాదిరిగా నక్కారు.

"క్యాహై ఏ గడ్‌బిడీ?" గద్దిస్తూ అడిగాడు అమీనా.

దశరథరాంరెడ్డి చేతులు నులుముకుంటూ ముందుకొచ్చి నిల్చున్నాడు. "కొలువు కొలుసుకుంటుండా మండీ" అన్నాడు.

"కొలువ్ కొలసటం కానూన్ ఖిలాఫ్ హై. మీ

అందర్కీ హాథ్‌కడీ వేసి తీస్కాపోతాను" అన్నాడు అమీనా.

"సెమించండి. ముడుపుకట్టాం. కలరా ఆగింది. కొలువు ఆపితే అమ్మోరు మళ్లీ విరుచుకపడుద్ది" అన్నాడు దశరథరాంరెడ్డి.

అమీనా తల అడ్డంగా ఊపి "నైనై.. మీ అమ్మోరు గిమ్మోరు నహీ జాంతే. మీ అందర్కీ ఇప్పుడు జైల్ ఖానా చూపిస్తా, ఠాణాకు నడవండి" అన్నాడు.

దాతో దశరథరాంరెడ్డి వణికిపోయాడు. పటేలును చాటుకు పిల్చుకపోయి నూరు వెండిరూపాయలు చేతిలోపోశాడు. "పటేలూ ఈ ఎవారాన్ని ఎట్టాగన్నాదిప్పు. ఇప్పుడు మాత్రం కొలుపు ఆగకూడదు. అట్లా మధ్యనాగడం ఊరికే కీడు" అన్నాడు. పటేలు అంగీకారంగా తలూపాడు. ఆ నూరురూపాయలు అమీనా, అతడు చెరిసగంగా పంచుకున్నారు. కాని ఆరోజునుండి గ్రామంలో అతడికి తెలియకుండా డబుకుమీద దెబ్బపడలేదు. భాగవతం, బొమ్మలాటలు ఆడించుకోవాలన్నా అతడిమామూలు అతడికి ముట్టజెప్పిన తర్వాతనే. గ్రామం వారందరికీ అతడంటే భయముభక్తి ఏర్పడ్డాయి. అప్పటినుండి అతడి మాటకెదురు లేకుండానే సాగుతూ వచ్చింది. కాని.....

ఇప్పుడా రోజులన్నీ గుర్తొచ్చాయ్. ఆ రోజులకు ఈ రోజులకు పోల్చి చూసుకున్నాడు. అతడి గుండె ఒక్కసారి చెరువైపోయింది. ఇస్సురోమంటూ వేడి నిట్టూర్పును వదిలాడు.

అంతలోనే గజ్జెలరెడ్డి వచ్చి "అయ్యా అన్నానికి లేవవూ?" అన్నాడు.

"తర్వాత తింటాలే, ముందు నువ్వు తిను" అన్నాడు పటేలు.

"నేను తిన్నానయ్యా, ఇక నువ్వే ఉన్నావు" అన్నాడు గజ్జెలరెడ్డి.

పటేలు లేచి వంటగదివైపుకు వెళ్ళాడు. గజ్జెలరెడ్డి బయటి వరండాలో పక్కపరుచుకుని పడుకున్నాడు. పటేలు అన్నం పెట్టుకుని తిని లేచివచ్చేసరికల్లా రాత్రి ఝాము పొద్దుపోయింది. అప్పటికే చుట్టుపక్క ఇళ్లవారు గురకలు పెట్టడం వినిపిస్తోంది. పొగచుట్ట చుట్టుకుని కాల్చుకున్నాడు. తలుపులు గడియలన్నీ బిగవేసి నడుమహాలులో ఉన్న మంచంపై పక్క సరిచేసుకున్నాడు. భార్య మంచం వద్దకొచ్చి నిలబడి...

"ఏమేవ్, పడుకుంటున్నాను" అన్నాడు.

(ఇంకా వుంది)

క్యాంపస్ ఛాట్

కానిస్టేబుల్, డిఎస్సీకి క్యాంపస్‌లో ప్రిపరేషన్!

అమృత

వెనుకబడిన తరగతికి చెందిన వర్గం మధ్యతరగతిని అనుకరిస్తుంటే, మధ్య తరగతివారు పాశ్చాత్య దేశాలస్థాయిని అందుకోవాలని అర్రులు చాస్తున్నారు. ఇక ఉన్నత వర్గాల గురించి ప్రత్యేకంగా చెప్పాల్సిన అవసరం లేదు. మధ్య తరగతి కుటుంబాలకు చెందిన యువతపైనే ఇప్పుడు ఎక్కువ వత్తిడి పడుతోంది. మధ్యతరగతి యువత పైకి పోలేక, కిందికి దిగజారలేక మధ్యలో నలిగిపోతోంది. ఈ తీరు కళాశాల స్థాయిలోనే కాదు, విశ్వవిద్యాలయ స్థాయిలోనూ కొనసాగుతోంది.

వలచి, వలపించుకోవడమనేది ప్రతి క్యాంపస్‌లోనూ సాధారణమైన విషయంగా చెప్పుకుంటారు. క్రిస్టాబెల్ పరిమాణాలు, ఒంపుసొంపులు కనిపించే దుస్తులు, తేనెపలుకులు, సమ్మోహనపరిచే క్రీగంట చూపులు... ఇక్కడివారి అమ్ములపొదిలో అస్త్రాలు. పైగా క్యాంపస్ అనగానే జంటలు జంటలుగా తిరగటం, విచ్చలవిడిగా ఖర్చుచేయటం, పరీక్షల సమయంలో ఒన్‌డే మ్యాచ్‌లా ప్రిపేరయి ఎగ్జామ్ రాసేవాళ్ళు... ఇలా ఇలా ఇక్కడి యూత్ గురించి ఎన్నెన్నో చెప్పుకుంటారు. అంతేకాదు, ఇక్కడి యువతకు ఎవరూ ఆదర్శంగా లేరు. ఎవరు విందు వినోదాలతో మిత్రులకు కాలక్షేపం అందిస్తున్నారో వారే ప్రముఖులని చాలామంది నమ్మకం. ఏమాత్రం క్యాంపస్‌తో టచ్ లేనివాళ్ళకయినా ఇటువంటి విషయాలన్నీ చాలా ఈజీగానే తెలుస్తాయి. ఇంకా వివరంగా చెప్పనవసరం లేదు. మరో పార్శ్వం నుండి చూస్తే... యూనివర్శిటీ స్టూడెంట్స్ అంటే వాళ్ళకొక ప్రత్యేకత ఉంటుంది. ఎక్కువమంది క్యాంపస్‌లో ఉన్న రోజుల్లోనే ఏదో ఒక మంచి ఉద్యోగం సంపాదించి వెళ్ళిపోవాలని ఆశిస్తుంటారు. పైగా సైన్స్ గ్రూప్ వాళ్ళకయితే క్యాంపస్‌లో ఉన్నన్నాళ్ళూ కూడా ఏదో ఒక ప్రైవేట్ కాలేజీలోనో, కాల్ సెంటర్‌లోనో ఉద్యోగం దొరుకుతుంది. అంతేకాదు, పార్టుటైమ్ ఉద్యోగాలు కూడా వాళ్ళకు ఈజీగా దొరుకుతాయి. అదే ఆర్ట్స్ గ్రూప్ వాళ్ళకైతే దొరకటం కష్టం. వీళ్ళల్లో ఎక్కువ శాతం మంది గ్రామీణ ప్రాంతం నుండి వచ్చినవాళ్ళే కనిపిస్తారు. పైగా లాంగ్వేజ్ ప్రాబ్లం. అందుకే ఎక్కువమంది కాంపిటేటివ్ ఎగ్జామ్స్‌కే ప్రిపేర్ అవుతుంటారు. ఎక్కడివరకో ఎందుకు హైదరాబాద్‌లోని ఉస్మానియా యూనివర్శిటి హాస్టల్ విద్యార్థులనే చూడండి...

క్యాంపస్‌లో న్యూ పిజి హాస్టల్, న్యూ రీసెర్చ్ స్కాలర్స్ (ఎన్ఆర్ఎస్) హాస్టల్ పక్కపక్కనే ఉంటాయి. ఎన్ఆర్ఎస్ హాస్టల్ అంటే చాలామందికి తెలీదు. ఎందుకంటే ఆ హాస్టల్లోని దళిత స్టూడెంట్స్ అంతా కలిసి ఆ హాస్టల్ పేరును బిఆర్ అంబేద్కర్ హాస్టల్‌గా మార్చారు. ఇప్పుడు బిఆర్ అంబేద్కర్ హాస్టల్ రూమ్స్‌కు వెళ్లి చూడండి... కిటకిటలాడి పోతుంటాయి. ఇది వాస్తవం. ఒక్కొక్క రూమ్‌లో నలుగురైదుగురు ఉంటారు. అంతా గ్రూప్ స్టడీ చేస్తుంటారు. ఆ రెండు హాస్టళ్ళ మధ్య ఎంత అంతరమో గమనించారా? పక్కనే ఉన్న న్యూ పిజీ హాస్టల్లో ఎక్కువమంది సైన్స్ స్టూడెంట్స్ ఉంటారు. ఉదయం క్లాసులకు, సాయంత్రం పార్టు టైమ్ జాబ్స్‌కు పోతుంటారు. అందుకే అక్కడ పెద్దగా స్టూడెంట్స్ కనిపించరు. ఉదయంపూట హాస్టల్ ముందున్న చెట్లకింద పెద్దసంఖ్యలో బైక్‌లు కనిపిస్తాయి. బిఆర్ అంబేద్కర్ హాస్టలైతే ఏ టైమ్‌లో వెళ్ళినా స్టూడెంట్స్ చదువుతూనే కనిపిస్తారు. దళిత విద్యార్థులకు మరో దారిలేక ఇక్కడికొస్తున్నారు. ఇదే అంశంపై దళిత స్టూడెంట్స్ మాట్లాడుతూ, "ఇక్కడ లైబ్రరీ ఫెసిలిటీ ఉంది. రెఫరెన్స్‌కు మంచి బుక్స్‌తోపాటు, డిస్కషన్ చేయటానికి కూడా టాలెంట్ ఉన్నవాళ్ళు దొరుకుతారు. తిండి విషయానికి వస్తే బయటతిని వస్తాం. ఎక్కువ టైమ్ లైబ్రరీలోనే గడుపుతాం..." అని చెప్పారు. ఇలా చదివేవాళ్ళలో ఎక్కువమంది హాస్టలర్స్ కాదు. బయటినుండి వచ్చిన ఫ్రెండ్స్, లేదా బంధువులే. ఇంకా క్యాంపస్‌లో అడ్మిషన్స్ మొదలుకాలేదు. అయినా హాస్టల్స్ మాత్రం కళకళలాడుతున్నాయి. ఎందుకంటే జూన్ నెల ప్రారంభం కాకముందే కాంపిటేటివ్ ఎగ్జామ్స్ ప్రిపరేషన్ కోసం వచ్చినవాళ్ళ సంఖ్యపెరగటమే ఇందుకు కారణం. ప్రస్తుతం ఎన్ఆర్ఎస్ హాస్టల్‌లోనే కాదు, దాదాపు అన్ని హాస్టల్స్‌లోనూ ఇదే తీరు కనిపిస్తోంది.

ఇంటర్‌మీడియట్ క్వాలిఫికేషన్‌తో సెలక్ట్ కానున్న పోలీస్ కానిస్టేబుల్ పోస్టుల కోసం డబుల్ పీజీలు చేసిన వాళ్ళేకాదు, స్కాలర్స్‌కూడా ఉదయం సాయంత్రం క్యాంపస్ గ్రౌండ్‌లో పరుగులు తీస్తున్నారు. ఫిజికల్ ఫిట్‌నెస్ కోసం విశ్వప్రయత్నం చేస్తున్నారు. లాంగ్ జంప్, హై జంప్ ఈవెంట్స్‌లో క్వాలిఫై అవ్వటానికి మెళకువలు తెలుసుకోటానికై సీనియర్స్‌ను కాకా పడుతున్నారు. "తొమ్మిది వేల పోస్టులు... ఈ ఛాన్సు పోతే మళ్ళీ అవకాశం వస్తుందో రాదో..." అనే భయంతో పోటీపడుతున్నారు. మరికొంత మంది డిఎస్సీ పరీక్షలకు ప్రిపేర్ అవుతున్నారు. యూనివర్శిటీ హాస్టల్ రూమ్స్‌లో ఇటువంటివారు దాదాపు పాతిక శాతం మందికి పైగా కనిపించారు. ఈ కాంపిటేటివ్ పరీక్షలకు పోటీ పడుతున్న కుర్రాళ్ళకు ప్రతి నిమిషం విలువైనదే. టైమ్ విలువ ఇప్పుడు తెలిసి రూమ్ నుండి బయటికి రాకుండా చదువుతున్నారు. డబుల్ పీజీ చేసి సామాన్య కానిస్టేబుల్ ఉద్యోగం కోసం అహర్నిశలూ శ్రమిస్తున్నవాళ్ళను పలకరిస్తే, "గతంలో అఫ్టాల్ కానిస్టేబుల్ ఉద్యోగం అనుకునే వదిలేశాం. ప్రభుత్వ తీరుచూస్తుంటే, భవిష్యత్‌లో ఈ ఉద్యోగాలు కూడా ప్రైవేట్‌పరం చేసినా ఆశ్చర్యం లేదు. ఎక్కడి వరకో ఎందుకు, డిఎస్సీనే చూడండి బిఎడ్ చేసినవాళ్ళతో ఇక్కడి స్కాలర్స్‌కూడా పోటీపడలేరు. ఎందుకంటే రీసెంట్‌గా బిఎడ్ చేసినవాళ్ళకు సబ్జెక్ట్‌తో టచ్ ఉంటుంది. గెయిన్ అయ్యే ఛాన్సు వాళ్ళకే ఎక్కువగా ఉంటుంది. భద్రత లేని కాంట్రాక్టు ఉద్యోగుల తీరు చూస్తున్నాం. అందుకే ఈ భయం..." అంటున్నారు.

చందు

ఆటుపోట్లు సహజం...

హాస్య నటుడు రాళ్ళపల్లి చెప్తోన్న కబుర్లు...

ఈ వృత్తిలో ఆటుపోట్లు సహజం ఒక్కొక్కసారి నెల, రెండు నెలలు ముఖానికి రంగు వేసుకోని పరిస్థితి. ఏమిటి మన కెరీర్ అయిపోయిందా? ఇండస్ట్రీలో ఎందుకూ పనికిరాకుండా పోయామా అన్న భయం కలుగుతుంది. తర్వాత మంచి అవకాశాలొచ్చినా ఇలాంటి డిప్రెషన్ వచ్చినపుడు మాత్రం జాబ్‌లో కొనసాగి ఉంటే ప్రతి నెలా 10, 15 వేలు వచ్చేవిగా... కాలుమీద కాలేసుకుని కూర్చొనేవాడిని కదా... అనిపించేది. ప్రభుత్వం ఇచ్చే లోన్‌తో లేదా ఉద్యోగంలో కూడగట్టుకున్న దాంతో ఇల్లు సమకూర్చుకుని రిటైరయ్యాక ఏ త్యాగరాయగానసభకో, రవీంద్రభారతికో వెళ్ళి కూర్చుని చూసి ఆనందించేవాడిని కదా అనుకుంటూ ఉంటా. చూసి ఆనందించడంకన్నా ఇప్పటికీ చేసి ఆనందిస్తున్నందుకు సంతోషంగా ఉంది.

నాటకాలు మగ సంతానం లేకుండా చేశాయా?

1977 ఎమర్జెన్సీ సమయం. 'వర విక్రయం' నాటకం వేయడానికి మద్రాస్ వెళ్ళాను. ఆ సమయంలో నా భార్య నాలుగు నెలల గర్భవతి. ఏదో గైనిక్ ప్రాబ్లమ్ వచ్చి చెకప్‌కని గాంధీ ఆసుపత్రికెళ్ళింది. 'అర్జెంటుగా అబార్షన్ చేసి గర్భసంచి తొలిగించకపోతే ప్రాణానికి ముప్పు' అని లేడీ డాక్టర్ భయపెట్టేసింది. నేనేమో ఊళ్లో లేను. ఈ రోజుల్లో లాగా సెల్ ఫోన్లు, ఎస్టీడీ సౌకర్యం లేదు. నా అనుమతి లేకుండా నేనొచ్చేటప్పటికి అబార్షన్ చేయడం, గర్భసంచి తీసేయడం జరిగింది. చనిపోయింది మగ శిశువు అని తెలిసింది. వ్యక్తిగత జీవితంలో మర్చిపోలేని దారుణమైన సంఘటన ఇది. నాటకం ఉందని మద్రాస్ వెళ్ళబట్టే కదా! నేనుంటే ఈ పరిస్థితి వచ్చేది కాదేమో! అని బాధపడుతూ ఉంటాను. నా నాటకాలు మగ సంతానం లేకుండా చేయడానికి కారణమైనాయా? అనిపిస్తూ ఉంటుంది. మగ సంతానం కావాలని తల్లి కోరుకోవడం, కూతురుండాలని తండ్రి కోరుకోవడం సహజం. కూతురి విషయంలో భగవంతుడు నా కోరికను తీర్చినా నా భార్య వైపు చూస్తే అది పెద్ద లోటే... తీరని బాధే...

మిత్రులు... ఆత్మీయులు....

వెంకన్నబాబు నా ఎదుగుదలకు బాగా దోహదపడ్డాడు. నా దగ్గర ఒక్క రూపాయి కూడా లేని రోజుల్లో మద్రాస్‌లో ఇల్లు కొనిపెట్టి నా కాల్షీట్లు చూస్తూ, వచ్చిన డబ్బుతో ఇంటిమీద అప్పు తీరుస్తూ నన్ను నిలబెట్టాడు. నా ప్రాణానికి ప్రాణమైన మిత్రుడు అని చెప్పుకోదగినవాడు చలపతిరావు! చూడడానికి చిరుతపులిగా కనబడతాడు. దుర్మార్గుడుగా కనిపిస్తాడు కానీ ఇలాంటి మంచి మనుషులు పరిశ్రమలో చాలా తక్కువనే చెప్పాలి. ఇక తనికెళ్ళ భరణి అత్యంత ఆత్మీయుడు, పుత్ర సమానుడు. అతనికి పెళ్ళయ్యేవరకు నా దగ్గరే ఉన్నాడు. నారాయణమూర్తి సినిమా షూటింగ్ అంటే ఓ నెలపాటు రంపచోడవరంలో ఉండాల్సివచ్చేది. ఇంట్లో వయసొచ్చిన కొడుకు తోడున్నాడన్న ధైర్యంతో నిశ్చింతగా ఉండేవాణ్ణి.

అంతరాత్మ ఘోషిస్తోంది...

కెరీర్ తొలి రోజుల్లో ఫలానా వేషానికి నేను పనికొస్తానంటేనే వేషం ఇచ్చేవారేగానీ నా కోసం వేషం రాయడమనేది కాదు. పదిసార్లు పలకరించాడు కనుక వాడికి వేషం ఇవ్వాలన్న తాపత్రయం ఉండేది కాదు. స్నేహం స్నేహమే... వృత్తి వృత్తే... పరిశ్రమ మద్రాస్‌లో ఉన్నంతకాలం దర్శకులు, నటీనటుల మధ్య సంబంధం కుటుంబంలా ఉండేది. అది ఇవాళ కనబడడం లేదు. ఫలానా సినిమాలో నటించినా, నటించకపోయినా ప్రివ్యూ షోకి పిలిచేవాళ్ళు. సినిమా చూసి లోటుపాట్లు చర్చించుకునేవాళ్ళం. సహృదయంతో ఫలానా సన్నివేశం ఎబ్బెట్టుగా ఉందని చెబితే దాని గురించి ఆలోచించేవారు. ఈరోజు ఆ వాతావరణం లేదు. అసలు ప్రివ్యూలే లేవు. ఈ మధ్యన సినిమా విడుదలైన తర్వాత సక్సెస్ మీట్ అని పెడుతున్నారు. నా క్యారెక్టర్ గురించి అయితే చెప్పగలను గానీ సినిమా చూడకుండా సినిమా గురించి ఏమని మాట్లాడగలను? మా దర్శకుడు కష్టపడి సినిమా తీశారు. ప్రొడ్యూసర్ ఖర్చుకి వెనకాడకుండా సినిమా నిర్మించారు. హీరో బాగా చేశాడని చెప్పాలి తప్ప సినిమా గురించి ఏం మాట్లాడగలను. అందుకే ఈ సక్సెస్ మీట్లకీ, ప్రెస్ మీట్లకీ సాధ్యమైనంతవరకు దూరంగా ఉంటాను. సినిమాలో వేషం ఇచ్చినందుకు కృతజ్ఞతలు అని మాత్రం చెప్పగలను. నా వేషం అద్భుతమైతే నాలుగు మాటలు మాట్లాడొచ్చు. నా వేషం నాకే సంతృప్తి ఇవ్వనపుడు ఏం మాట్లాడతాను. అథవా మాట్లాడినా అవి అబద్ధాలని ఓ పక్క అంతరాత్మ ఘోషిస్తూనే ఉంటుంది.

*

చిన్నారి చిత్రకారులు



ఆర్.రాహుల్ కుమార్, 9వ తరగతి, సెయింట్ ఆన్స్ స్కూల్, మార్కాపూర్.

జె.ఉమేష్ రావ్, 8వ తరగతి, జడ్‌పిహెచ్ స్కూల్, మదనపల్లి, చిత్తూర

చుక్కల్లో దాగినదెవరో!



రంగులు అద్దేస్తే పోలా

7 తేడాలేవబ్బా!

హేయ్! కింద రెండు పప్పీలున్నాయికదా. అవి రెండూ చూడ్డానికి అచ్చుగుద్దినట్టు ఒకేలా కనిపిస్తాయి. కానీ... రెండిట్లోనూ ఏడు తేడాలున్నాయి. అవేంటో కనిపెట్టండి చూద్దాం.



దారి కనుక్కోవడం ఎలాగో ఏమో



నేస్తాలూ... పై బొమ్మలో టర్కీ కోడి వుందికదా. అది...ఆ ఇంట్లోవున్న గజిబిజి దారులన్నీ దాటుకుని బయటికి రావాలి. మీరేమైనా సాయం చేయకూడదూ!

చేపల వేటకెళదామా?

నేస్తాలూ... మీకు చేపలను వేటాడ్డం వచ్చా! రాదా? అయితే మరి మమ్మల్ని నేర్పించమంటారా? మాకు తెలుసు మీరంతా ఎంతో ఉత్సాహంగా నేర్చేసుకుంటారని. మరి ఆలస్యం ఎందుకర్రా మొదలెట్టేద్దాం.

కావాల్సిన వస్తువులు: ఒక అట్టపెట్టె, రంగు కాగితం, గమ్, పెన్సిళ్లు చెక్కుకునే చాకు, కత్తెర, పేపర్ క్లిప్పులు, దారం, అయస్కాంతం, పేపర్ ట్యూబు, మందపాటి అట్టముక్క (మీ నోడ్సులకు వుంటుందికదా అది).

ఎలా చేయాలంటే: ముందు అట్టపెట్టెను బోర్లించండి. దాని చుట్టూ రంగు కాగితాన్ని అతికించండి.

- చాకు తీసుకుని బాక్సు కింది భాగంలో మూడు రంధ్రాలు చెయ్యండి. ఇవి దీర్ఘచతురస్రాకారంలో వుండాలి.
- ఇప్పుడు మందపాటి అట్టముక్క తీసుకుని చేప ఆకారాలను కత్తిరించండి.
- ప్రతి చేపకు పేపర్ క్లిప్ పెట్టండి.
- ఇప్పుడు న్యూస్ పేపర్ తీసుకుని చుట్టండి. అది ఊడిపోకుండా మధ్యలో అక్కడక్కడా అతికించండి. అంతే.... పేపర్ ట్యూబ్ తయారైనట్టే.
- ఇప్పుడు దారం తీసుకుని ఒక చివరన అయస్కాంతం కట్టండి. దారం మరో చివరను పేపర్ ట్యూబ్‌కి ఒక చివర కట్టండి. ఆంతే... గేలం రెడీ అయినట్టే.
- ఇప్పుడు అట్టపెట్టె రంధ్రాలలోంచి చేపలను లోపలికి వెయ్యండి. చివరిగా రెడీగా వుంచిన గేలాన్ని అట్టపెట్టె లోపలికి పంపి చేపలను పట్టండి. ఎవరికి ఎన్ని ఎక్కువ వస్తే వారు గెల్చినట్టు.

(గేలానికి అయస్కాంతం వుంటుందికదా. అది చేపమూతి దగ్గరున్న పేపర్ క్లిప్‌ను ఆకర్షిస్తుంది. అప్పుడు మీరు గేలాన్ని బయటకు లాగితే చేప చిక్కుతుందన్నమాట.)

చేసేద్దాం



అట్టమీది కథ

ఎం. కోటేశ్వరరావు



గ్వాంటనామో బే

చిత్ర హింసలకు చిరునామా...

నయాగారా అంటే జలపాతం !

తాజ్‌మహల్ ప్రేమకు నీరాజనం !!

గ్వాంటనామో బే అమెరికా చిత్రహింసలకు చిరునామా !!!

హిట్లర్ గురించి, ఆ దుర్మార్గుడు ఏర్పాటు చేసిన కాన్‌సెంట్రేషన్ క్యాంపుల గురించి విన్నాం. నైజాం సర్కారుకు వ్యతిరేకంగా కమ్యూనిస్టుల నాయకత్వాన సాగిన తెలంగాణా రైతాంగ సాయుధపోరు సందర్భంగా నైజాం ఒకవైపు, నెహ్రూ నాయకత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వాలు మరొకవైపు అలాంటి కేంద్రాలనే ఏర్పాటు చేసి కమ్యూనిస్టులను అణచేందుకు ప్రయత్నించారు. అలాంటి చిత్రహింసల కేంద్రాన్నే ఘనత వహించిన ప్రజాస్వామ్య అమెరికా గ్వాంటనామో బేలో నిర్వహిస్తోంది. ఈ కేంద్రంలో 2002 నుండి ఈ ఏడాది మేనెల వరకు 759 మందిని బంధించినట్లు అమెరికా తెలిపింది. దాదాపు 35 దేశాలకు చెందిన ఐదువందల మంది వరకు ఇప్పుడు . ఈ కేంద్రంలో ఎలాంటి విచారణ లేకుండా అమెరికన్ మిలిటరీ ముష్కరుల చేతుల్లో చిత్రహింసలు అనుభవిస్తున్నారు.

ఇంతవరకు కేవలం పదిమంది మీదనే ఆరోపణలు దాఖలు చేశారు. వాటి విచారణ కూడా పూర్తికాలేదు. చిత్రహింసలను తట్టుకోలేక ముగ్గురు బందీలు ఈనెల 9వ తేదీన ఆత్మహత్యలకు పాల్పడ్డారు. వారి పేర్లను అధికారయుతంగా ప్రకటించలేదు. సౌదీకి చెందిన అనిబిన్ షామాన్, యాసర్ తలాల్ అబ్దుల్లా, మరొకరు యెమెన్ జాతీయుడని వెల్లడైంది. ఈ ఉదంతాన్ని మూసి పెట్టేందుకు అమెరికా ప్రయత్నించింది. తీరా సాధ్యంగాక పోవటంతో తమ ప్రభుత్వాన్ని అపఖ్యాతి పాలు చేసేందుకు ఖైదీలు ఆత్మహత్య రూపంలో చేస్తున్న దాడి ఇదని అమెరికా అధికారులు వ్యాఖ్యానించారు. సరిగ్గా ఇలాంటి పదాలనే హిట్లర్ మూకలు కూడా గతంలో యూదుల గురించి వల్లించాయి. ఇప్పుడు అమెరికన్లు ముస్లింల గురించి ఇలా మాట్లాడుతున్నారు.

ఇంతకూ ఈ చిత్రహింసల చిరునామా ఎక్కడంటున్నారు కదూ? అమెరికా ఆక్రమణలో గత వందేళ్లకు పైగా ఉన్న క్యూబా ప్రాంతం. క్యూబా ఆగ్నేయ ప్రాంతంలో తమ నౌకలకు ఇంధనం నింపేందుకు కావా లంటూ 45 చదరపు కిలోమీటర్ల వైశాల్యం ఉన్న దీవిని అమెరికా వందేళ్ల క్రితం క్యూబా నుండి కౌలుకు తీసు కున్నది. మీ ఇంటికొస్తే మాకేం పెడతావ్ మాఇంటి కొస్తే మాకేం తెస్తావ్ అన్నట్లు అమెరికా కౌలు ఒప్పందం రాయించింది. క్యూబా, అమెరికా రెండూ పరస్పర అంగీకారంతో గానీ లేదా అమెరికా తనంతటతాను గాని వదులుకోవాలనుకొంటే తప్ప ఒప్పందం ఎలాంటి కాలపరిమితి లేకుండా కొనసాగవచ్చు. క్యూబాలోని కమ్యూనిస్టు వ్యవస్థను కూల్చివేయాలని చూస్తున్న అమెరికా ఈ దీవిని తిరిగి క్యూబాకు అప్పగించటం జరిగేదేనా?

తోడుదొంగలు

గ్వాంటనామో జైళ్లను తనిఖీ జరుపుతామంటే అమెరికా ఇంతగా భయపడటానికి అసలు కారణం వేరే ఉంది. అక్కడి జైళ్లు నిండిపోవటంతో బందీలను ఇప్పుడు తూర్పుఐరోపాలోని రహస్య కేంద్రాలలో నిర్బంధిస్తోంది. అందుకు గాను సిఐఏ విమానాలు గుట్టుచప్పుడు కాకుండా, మారుపేర్లతో అనేక ఐరోపాదేశాల మీదుగా బందీలను చేరవేస్తున్నాయి. ఐరోపా మానవహక్కుల పరిరక్షణా సంస్థలలో ఒకటైన ఐరోపా కౌన్సిల్ నివేదిక ప్రకారం ఆరుసార్లు సిఐఏ హక్కుల ఉల్లంఘనకు పాల్పడినట్లు అనుమానం. జర్మనీ, ఇటలీ, స్వీడన్, బ్రిటన్, బోస్నియా, మాసిడోనియా, టర్కీ ప్రభుత్వాలకు తెలిసే బందీల విమానాలు ఆయా దేశాల గగనతలాలలో ప్రవేశించటం, విమానాశ్రయాలను వినియోగించుకున్నట్లు వెల్లడైంది. గ్వాంటనామోపై విచారణకు అంగీకరిస్తే ఐక్యరాజ్యసమితి ఈ వ్యవహారంపై కూడా విచారణకు ఆదేశించవచ్చని, అప్పుడు తోడుదొంగలు

బందీలను ఎలా తీసుకువస్తున్నారు?

ఇంతకీ ఈ జైలుకు బందీలను ఎలా తీసుకు వస్తారో తెలుసుకోలేదు కదూ ! ఎక్కడైతే అమెరికాను వ్యతిరేకించే వారుంటారో ఆ దేశాలన్నింటినుండీ వారికి ఉగ్రవాదులనే ముద్రవేసి తరలించుకురావటం జరుగుతోంది. ఆఫ్ఘనిస్థాన్‌లో పూర్వపు సోవియట్ యూనియన్ అనుకూల శక్తులకు వ్యతిరేకంగా అమెరికా స్థానికులను(తాలిబాన్లను) రెచ్చగొట్టి ఆయుధాలిచ్చి తిరుగుబాటు చేయించింది. దానికి మతోన్మాదాన్ని జోడించింది. బిన్‌లాడెన్ ఆ విధంగా అమెరికా పెంచి పోషించిన వ్యక్తే. సోవియట్ అంతరించిన తరువాత ఇప్పుడు ఆ తాలిబాన్లే అమెరికాకు వ్యతిరేకంగా తయారయ్యారు. వారిని అణచేందుకు సైన్యాన్ని పంపిన అమెరికా అక్కడ దొరికిన వారిని గ్వాంటనామోకు తరలిస్తోంది. ఆఫ్ఘన్ సాయుధ ముఠాలు, పాకిస్తాన్ అధికారులు కొంతమందిని పట్టుకొని అమెరికన్లకు డాలర్లకు అమ్ముతారు. ఇరాక్, బోస్నియా, గాంబియా ఇలా 35దేశాల నుండి బందీలను అక్రమంగా పట్టుకొచ్చారు.

ఊరందరికీ ఉల్లిపాయ.......

గ్వాంటనామో జైళ్లను మూసివేయాలని, బందీల గురించి విచారణ జరపాలన్న ఐక్యరాజ్యసమితి మానవహక్కుల కమిషన్ను కూడా అమెరికా ఖాతరు చేయలేదు. తాను అంతర్జాతీయ చట్టాలకు అతీతమని చెప్పటం తప్ప ఇది వేరుకాదు. గ్వాంటనామోలో 31 మంది బందీలు మరణించినట్లు వెల్లడైంది. దానిపై విచారణకు హక్కుల కమిషన్ బదులు రెడ్‌క్రాస్‌ను అనమతిస్తామని అమెరికా అధికారులు చెప్పారు. ఐరాస కమిషన్ విచారణాంశాలను నివేదిక రూపంలో ప్రపంచానికి వెల్లడిస్తుంది, రెడ్‌క్రాస్‌కు అటువంటి అధికారం లేదు. అమెరికా ప్రభుత్వం ప్రకటించిన పత్రాలలో గ్వాంటనామో బందీలను చిత్రహింసలు పెట్టినట్లు ఆధారాలు దొరికాయి. దాంతో కావాలంటే ముగ్గురు ఐరాస పరిశీలకులు రావచ్చని, అయితే బందీలతో వారు విడిగా మాట్లాడటానికి అంగీకరించేది లేదని మెలిక పెట్టింది. ఇతరులకు నీతులు హక్కుల గురించి, విచారణకు సహకరించాలని నీతులు చెప్పే అమెరికా తనవరకు వచ్చే సరికి వ్యవహరించిన తీరు ఆశాభంగం కలిగిస్తున్నదని ఐరాస కమిషన్ మానవహక్కుల ఉల్లంఘన నివేదికలో వ్యాఖ్యానించింది.

గ్వాంటనామోలో ఏం జరుగుతోందో బయటి వారికి తెలియటం అంత తేలిక కాదు. రాజకుమారిని అపహరించేందుకు వచ్చే దుష్ట సేనానాయకులను నిలువరించేందుకు విచ్చుకత్తులతో కుత్తుకలను తెగగోసే మెరికల్లాంటి వారిని పహారాకు నియమించారని పేదరాసి పెద్దమ్మ కథల్లో చదువుకున్నాం. గ్వాంటనామో బేలో కూడా అంతే, చీమ చిటుకుమంటే తుపాకిగుళ్ల వర్షం కురుస్తుంది. విమానాలు బాంబులు వేస్తాయి. నౌకలనుండి ఫిరంగులు మోగుతాయి. జైలంటే ఎలా ఉంటుందనుకుంటున్నారు. గోడలు ఉండవు. బ్రాయిలర్ కోళ్లను రవాణా చేసే లారీలో ఇనుపతెరలతో చిన్న గూళ్లను ఏర్పాటు చేస్తారు. గ్వాంటనామో జైలు కూడా అలాగే ఇనుపచువ్వల గదులతో ఉంటుంది. బందీలను వాటి మధ్య వడవేస్తారు. ప్రతివారూ అందరికీ కనిపిస్తారు. ఏదీ దావరికం ఉండదు. అలాంటి జైలులోని ప్రతి గదినీ ప్రతి 30 సెకండ్లకు ఒక గార్డు చూసి వెళుతుంటాడు. ఆరుగురు మిలిటరీ పోలీసుల బృందం సూర్యకాంతిని తలపించే నియాన్‌లైట్లతో బందీలను గమనిస్తూ 24 గంటలూ డ్యూటీలో ఉంటుంది. ఎవరైనా టాయిలెట్‌కు వెళ్లాలనుకొంటే ఒక టవల్‌ను ఇనుప ఊచలకు వేలాడదీస్తే గస్తీ బృందం బయటకు తీసుకువెళ్లి తిరిగి తీసుకువస్తుంది. ఇంతటి కట్టుదిట్టమైన పహారా ఉన్నప్పటికీ అనేక మంది బందీలు చిత్రహింసలకు తాళలేక ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డారు. అధికారులు వెల్లడించిన, బయటకు వచ్చిన పాక్షిక సమాచారం ప్రకారమే2001- 2005 జనవరి మధ్య 25 మంది 41 సార్లు ఆత్మహత్యకు ప్రయత్నించారు. ఒక్క 2003 ఆగస్టు నెలలోనే 23 సార్లు అలాంటి ప్రయత్నాలు జరగ్గా వాటిలో ఒక్కరోజే పది జరిగాయి. ప్రపంచంలో అత్యంత ప్రజాస్వామికంగా వ్యవహరిస్తామని చెప్పుకొనే అమెరికన్లు ఎవరినైనా ఈ కాంపుకు

గ్వాంటనామో....సినిమా

ఈ చిత్రహింసల కేంద్రం నుండి బయటపడి ప్రాణాలు దక్కించుకున్న బ్రిటీష్ పౌరులు రసూల్, ఆసిఫ్ ఇక్బాల్, రాహుల్ అహమ్మద్ రెండు సంవత్సరాల పాటు అక్కడ నరకం అనుభవించి 2004 మార్చినెలలో విడుదలయ్యారు.' ఒకసారి ఆ కేంద్రానికి చేరటమంటూ జరిగితే ఆశలొదులు కోవటమే. మరుసటి రోజు నుండి ఎలా న్యాయం పొందాలి లేదా ఎలా మరణించాలన్న ఆలోచన తప్ప బందీలకు మరొకటి తోచదు. అక్కడ ప్రాణభయం తప్ప అమెరికన్లు అంటున్నట్లు 'అమరజీవులౌదామనే' ఆలోచనే బందీలకు రాదు. ఇస్లాంను నమ్మిన వారు ఆత్మహత్య చేసుకోవటం అంతసులభం కాదు. అయితే జైలు అధికారులు బందీలతో మీరింక వంటరిగా పడి ఉండటం తప్ప బయటపడేది లేదని రోజూ చెబుతుంటే పిరికిబారి ఆత్మహత్య చేసుకోవటం తప్ప మరణించి యుద్ధం చేద్దామనుకోవటం వట్టిమాట ' అని తామనుభవించిన వ్యధను వారు వెల్లడించారు.

' రోడ్ టు గ్వాంటనామో ' పేరుతో వారు ఒక సినిమా నిర్మించారు. ఫిబ్రవరిలో జరిగిన బెర్లిన్ చిత్రోత్సవంలో ప్రదర్శించారు. ఈనెల 23నుండి న్యూయార్క్‌లో ప్రదర్శించనున్నట్లు తెలిపారు. సినిమా గురించి ప్రచారం చేసేందుకు పర్యటనలు జరుపుతున్నారు. తమ చిత్రంలో అక్కడి బందీల ఆత్మహత్యల దృశ్యాలు లేవని అయితే తాము ప్రత్యక్షంగా అక్కడ అనేక మందిని చూశామని, భద్రతా సిబ్బందిని అప్రమత్తం చేసి రక్షించామని తెలిపారు. ఖైదీలను చావచితక కొట్టటం, ఖురాన్ ప్రతులను గార్డులు మరుగుదొడ్లలో పడవేయటం, బందీలకు గొలుసులు వేసి కళ్లుచెదిరే విద్యుత్ కాంతిని ప్రసరింప చేయటం, చెవులు బద్దలయ్యే శబ్దాలను వినిపించటం, బందీలతో బలవంతంగా చేయించిన అసహజమైన సెక్సు దృశ్యాల వీడియోలు చూపటం వంటి చర్యలన్నీ తమ చిత్రంలో ఉన్నాయని, అయితే తమకు ఒక్కొక్కరికి పదిలక్షల డాలర్ల వంతున నష్టపరిహారం చెల్లించాలని డిమాండ్ చేసినట్లు వాస్తవ కథకు జోడించినట్లు చెప్పారు.



తెచ్చారంటే వారింక బయటపడతామనే ఆశ వదులుకోవాల్సిందే. అందుకే బలవంతంగా మరణించేదుకు ప్రయత్నిస్తారు. అందుకు ప్రధానంగా సంవత్సరాల తరబడి నిరాహారదీక్షలకు పాల్పడుతున్నారు. అలాంటివారికి బలవంతంగా ఆహారం ఎక్కించేందుకు గొట్టాలు దూర్చటం కూడా చిత్రహింసలలో భాగమే. మానవహక్కుల గురించి ప్రపంచానికి చెప్పే అమెరికా ఇలాంటి దుర్మార్గానికి పాల్పడటం ఏమిటన్న ప్రశ్న, నిరసన ప్రపంచమంతటా వెల్లడౌతోంది. మందు, సిగిరెట్లు తాగటం చాలా సార్లు మానేశాను తెలుసా అన్నట్లు గ్వాంటనామో జైళ్లను మూసివేయాలని తాను చాలా సార్లు భావించానని అధ్యక్షుడు బుష్ పలు సందర్భాలలో చెప్పారు. మూసివేస్తాంగాని అక్కడ పెట్టిన పేరుమోసిన ఉగ్రవాదులను సురక్షితంగా ఎక్కడపెడతారో చెప్పండి చూద్దాం అని ఒకసారి అంటారు. ముగ్గురు బందీల ఆత్మహత్య తరువాత ఇలాంటి వ్యాఖ్యలతో పాటు అక్కడ ఉన్న 460 మంది బందీలను ఏంచేయాలని ప్రశ్నించారు. మాకు రాజకీయంగా, చట్టపరంగా ఇబ్బంది తలెత్తుతుందన్నారు. ఈ జ్ఞానం బందీలను పట్టుకు వచ్చినపుడు ఏమైందనే ప్రశ్నకు సమాధానం ఉండదు. అంతే కాదు ఉన్న జైళ్లు బందీలకు చాలటం లేదని, మూడు కోట్ల డాలర్లతో(150 కోట్ల రూపా యలకు సమానం) జైళ్ల విస్తరణ చేస్తున్నారు. మానవతా పూర్వక సాయం పేరుతో కమ్యూనిస్టు క్యూబానుండి తిరుగుబాట్లను ప్రోత్సహించేందుకు అక్కడి నుండి పారిపోయి వచ్చేవారిని, హైతీనుండి వచ్చే వారితో పాటు ఇప్పటికే అక్కడ ఉన్న 45 వేలమంది వలసదార్లకు తోడు 60వేల మంది నివశించేందుకు వీలుగా అక్కడ ఇళ్ల నిర్మాణం కూడా చేపడుతున్నారు. అంటే ఆ ప్రాంతాన్ని తిరిగి క్యూబాకు అప్పగించే ఆలోచన లేదన్నది స్పష్టం. కుక్కను చంపదలుచుకుంటే దాన్ని పిచ్చిదని ప్రచారం చేయాలన్నది ఒక చాణక్యనీతి. సరిగ్గా అమెరికా అదే చేస్తోంది. తమ విధానాలను, అక్రమాలను వ్యతిరేకించే ప్రతివారినీ ఉగ్ర వాదులుగానో, దేశాలైతే ధూర్త అనో చిత్రించి శత్రు పూరితంగా వ్యవహరిస్తోంది. గతంలో అది కమ్యూనిస్టు, వామపక్ష శక్తులు, దేశాలకే వర్తింప చేసింది. తరువాత కాలంలో ముస్లింలు, వారు మెజారిటీగా ఉండి అమెరికాను వ్యతిరేకించే దేశాలకు ఆ ముద్రవేస్తోంది. అమెరికా పెట్టుబడిదారులకు కావాల్సింది లాభాలు, అందుకు జాతి, కులం, మతం ఏ అస్త్రాన్నైనా ఆయుధంగా వాడతారు. అందుకే ఈ రోజు కమ్యూనిస్టులు, ముస్లింలపై కదా దాడి చేస్తోందని ఎవరైనా ఉపేక్షిస్తే రేపు తమవరకూ వచ్చినపుడు అయ్యోపాపం అనేవారే ఉండరని అందరూ గుర్తించటం అవసరం.

*

అంతులేని అమెరికా - ఆటవిక అధికారాలు

న్యూయార్క్‌లోని ప్రపంచ వాణిజ్య కేంద్రంపై ఉగ్రవాదుల దాడి అనంతరం అమెరికా పౌరులు కానివారిని నిరవధికంగా నిర్బంధించేందుకు 2001 నవంబరు 13న అధ్యక్షుడు బుష్ ఆదేశాలు జారీ చేశాడు.

ఉగ్రవాదంపై జరిపే పోరులో భాగంగా ఆఫ్ఘనిస్తాన్‌లో దొరికే వారిని ఇక్కడకు తరలిస్తామని మరుసటినెలలో రక్షణ మంత్రి రమ్స్‌ఫెల్డ్ ప్రకటించాడు.

గ్వాంటమో బందీలను విడుదల చేయాలని 2002 జనవరి 19న దాఖలైన హెబియస్ కార్పస్ పిటీషన్ను కోర్టు కొట్టివేసింది. పిటీషన్ దాఖలు చేసినవారిలో బందీల బంధువులెవరూ లేరని సాకు చెప్పింది.

బందీలలో బ్రిటన్‌కు చెందిన రసూల్,ఆసిఫ్ ఇక్బాల్, ఆస్ట్రేలియాకు చెందిన డేవిడ్ హిక్స్ బంధువులు దాఖలు చేసిన పిటీషన్ చెల్లనేరదని 2002 ఫిబ్రవరి 19న కోర్టుకు తెలిపిన అమెరికా. గ్వాంటనామో అమెరికా పరిధిలోకి రానందున అమెరికా చట్టాలు వర్తించవని ప్రకటన. అధ్యక్షుడికి ఉన్న యుద్ధ అధికారాల ప్రకారం బందీల నేరాలపై ఎలాంటి సమీక్ష జరపనవసరంల లేదు, వారిని కోర్టులలో ప్రవేశపెట్టనవసరం లేదు, లాయర్లకు అందుబాటులో తేవాల్సిన అవసరం లేదని జూన్‌లో ప్రభుత్వం చెప్పిన మరొక అభ్యంతరం. ప్రభుత్వ వాదన చెల్లదని కోర్టు కొట్టివేసింది. రసూల్, ఇక్బాల్‌తో సహా మరొక ఇద్దరిని 2004 మే 14న విడుదల చేసిన అమెరికా సుప్రీం కోర్టు. గ్వాంటనామో బందీలు అమెరికా కోర్టులో నిర్బంధాన్ని సవాలు చేయవచ్చని తీర్పు.

ఆరోగ్యం

దాతనుకున్న వ్యక్తే స్వీకర్త కావచ్చు...

వేదగిరి రాంబాబు

రోజురోజుకీ జనాభా పెరుగుతోంది. జనాభాతోబాటే వాహనాలూ పెరుగుతున్నాయి. గమ్మత్తేమిటంటే ఎవరికివారే తమ ప్రయాణం అర్జెంటన్నట్లు మిగతా వాహనాలను పట్టించుకోకుండా దూసుకుపోతున్నారు. ఫలితంగా యాక్సిడెంట్లు పెరిగిపోతున్నాయి.

ఏ యాక్సిడెంట్లోనయినా సాధారణంగా దెబ్బతినేది తలే. తల పగిలినా, బ్రెయిన్‌స్టెమ్ దగ్గర కోలుకోలేనివిధంగా దెబ్బతగిలినా బ్రెయిన్‌డెత్ కలుగుతుంది. దీనిని నివారించడానికి పోలీసులేకాదు, వాహనచోదకులతోబాటు పాదచారులూ అప్రమత్తంగా ఉండాలి. యాక్సిడెంట్లు తగ్గేలా చూడటం మనందరి బాధ్యత. అలాగే మెదడులోని రక్తనాళాల్లో ఒత్తిడి పెరిగినా, గోడలు సన్నబడ్డా రక్తనాళాలు చిట్లవచ్చు. దీనినే హేమరేజ్ అంటారు. హేమరేజ్ రాకుండా కూడా జాగ్రత్తలు తీసుకోవాలి.

అనారోగ్యం కలిగిన తరువాత చికిత్సకోసం పాకులాడడంకన్నా రాకుండా జాగ్రత్తపడడం చాలా అవసరం. పౌష్టికాహారాన్ని సకాలంలో తీసు కోవడంతోబాటు పరిశుభ్రత పాటిం చాలి. ఇన్‌ఫెక్షన్స్ రాకుండా చూసు కోవాలి. సమీపంలో అంటు రోగాలున్నవారుంటే ముందు జాగ్రత్త చర్యలు తీసుకోవాలి. వాక్సినేషన్లు సకాలంలో తీసుకుం టుండాలి. కొన్నికొన్ని స్థితులు కొన్ని అవయవాల్ని దెబ్బతీస్తాయికాబట్టి మధుమేహం, రక్తపోటు, కామెర్లలాంటివి కలగకుండా చూసుకోవాలి. విషపదార్థాలు, మత్తుపదార్థాలు, పెయిన్‌కిల్లర్స్, యాంటీబయాటిక్స్ లాంటి మాత్రలు వైద్యుని సలహా లేకుండా తీసుకోరాదు. అనారోగ్యాలు కలిగితే వెంటనే తగిన చికిత్స చేయించుకోవాలి. అవయవం పూర్తిగా పాడైపోయేదాకా అశ్రద్ధ చేయరాదు. అవయవం పూర్తిగా దెబ్బతింటే ఆ విషయాన్ని వైద్యుడు గ్రహించి మార్పిడి ఒక్కటే మార్గమని గుర్తించాలి. అప్పుడు అవయవమార్పిడికి సూచించాలి.

అవయవాలు ఎక్కడనుంచి వస్తాయంటే - బతికున్నవాళ్ల దగ్గరనుంచి కొంతభాగం తీసి ఇతరులకు ప్రాణదానం చేయగల అపయవాలు రెండే-(1) మూత్రపిండం, (2) లివర్ భాగం

మూత్రపిండాలు రెండుంటాయి కాబట్టి ఒకదానిని దానం చేసినా రెండోది మన పనులన్నింటినీ నిర్వహిస్తుంది. ఇక లివర్‌లో మూడోవంతు భాగమున్నా అది లివర్‌మొత్తం చేసే పనిని నిర్వర్తించగలదు. పైగా రెండునెలల్లో ఉన్న లివర్ పూర్తిస్థాయికి పెరుగుతుంది. అలాగే మార్పిడి చేయించుకున్న వాళ్లలోని లివర్‌కూడా రెండునెలల్లో పూర్తిస్థాయికి పెరుగుతుంది. జీవితాంతం పెరిగే అవయవం లివర్ ఒక్కటే! దీనిని కేవలం అతి సన్నిహిత బంధువులు అంటే కొడుకు, కూతురు, భార్య, భర్త, తల్లి, తండ్రిలాంటి వాళ్లకే ఇవ్వవచ్చు. మూత్రపిండం కూడా హెచ్‌ఎల్‌ఏ దగ్గరనుంచి మాచింగ్స్ సరిపోయినవాళ్లకే దానం చేయాలి. ఈ లివింగ్ డోనార్ డొనేషన్స్‌ని కొన్ని న్యాయనిబంధనలకు లోబడే చేయాలి.

ఏయే అవయవాల్ని దానం చేయొచ్చనే సందేహం కూడా కలుగుతుంటుంది. కళ్లలో కార్నియా, మూత్రపిండాలు, గుండె, ఊపిరితిత్తులు, కాలేయం, ప్రాంక్రియాజ్‌లాంటి అవయవాలన్నింటినీ దానం చేయొచ్చు.



(జూన్ 25 ప్రపంచ అవయవదాన, మార్పిడిదినం)

చాలామంది ఆత్మకి మరణంలేదు, శరీరం జీర్ణమైపోతుందంటారు. కానీ శరీరం జీర్ణం కాకుండా వివిధ అవయవాలను అవసరమున్నవాళ్లకు దానంచేసి, శరీరాన్ని మట్టికానివ్వకుండా చేయొచ్చు. అవయవదానమే అందుకుమార్గం.

మనం ఈ లౌకిక ప్రపంచంలో అన్నిం టికీ వెయిటింగ్‌లిస్ట్ చూస్తుంటాం. అలాగే కొన్ని అవయవాలు పూర్తిగా పాడైపోయి డెత్‌బెడ్‌మీద ఊగిసలాడుతూ, అవయవమార్పిడికోసం ఎదురుచూస్తూ ఎందరో ఉన్నారు. అభివృద్ధి చెందిన దేశాలైన యుఎస్ఎ, యుకెలాంటి దేశాల్లోనే వేలలో వెయిటింగ్‌లిస్టుందంటే మనదేశంలాంటి అభివృద్ధి చెందుతున్న దేశాల్లో ఎంత ఎక్కువ సంఖ్యలో ఈ అవయవదానం కోసం ఎదురుచూస్తున్నారో కదా!

స్పెయిన్‌లాంటి దేశాల్లో ఎవరైనా చనిపోతే వాళ్ల అవయవాలు ప్రభుత్వ ఆస్తిగా మారుతుందన్నమాట. ఆ అవయవాలు ఎవరికి అవసరముంటే వారికి దానం చేస్తారు. దానానికి ఇష్టపడనివాళ్లు ముందే ఆ విషయాన్ని తెలియజేయాలి. మనదేశంలో లక్షల్లో ఒకరు ముందుకు వచ్చి మరణానంతరం అవయవదానం చేస్తానని రిజిస్టర్ చేయించుకుని తన వాళ్లందరికీ చెప్తారు. ఎక్కువ స్వీకర్తలున్నచోట దాతలు తక్కువగా ఉండడం బాధాకర విషయం. యుఎస్ఎలో డ్రైవింగ్ లైసెన్సుమీదే డోనార్ అని కూడా ఉంటుంది. పొరబాటున ఏమైనా జరక్కూడని సంఘటనలు జరిగితే, వెంటనే ఆ వ్యక్తిని వెంటిలేటర్స్‌పై వుంచి వాళ్లవాళ్లకు తెలియజేస్తారు.

మనదేశంలో అవయవదానం ప్రాథమిక దశలో ఉండడంతో ముందే చాలా తక్కువమంది డోనార్స్‌గా డిక్లేర్ చేస్తున్నారు. మోహన్ ఫౌండేషన్ లాంటి స్వచ్ఛందసంస్థ ఎవరో ఏదో ఆసుపత్రిలో బ్రెయిన్‌డెత్ చెందారని తెలియగానే అక్కడికివెళ్లి, ఆ వ్యక్తి తాలూకు వాళ్లకు అవయవదాన ప్రాముఖ్యతను గూర్చి చెప్పి అవయవదానం చేసేలా ప్రేరేపిస్తున్నారు. అవయవదాన ప్రాముఖ్యతను చెప్పి అలా చేసేట్టు చేయడం మోహన్ ఫౌండేషన్‌లాంటి స్వచ్ఛంద సంస్థ బాధ్యతేకాదు, ప్రభుత్వం ప్రధానంగా ముందుకు రావాలి. తన ఆధ్వర్యంలో అందరూ కలిసి ఈ యజ్ఞాన్ని సక్రమంగా నిర్వహించేలా చూడాలి.

చిన్నప్పటినుంచీ అందరికీ అవయవదాన ప్రాధాన్యతను తెలియజేస్తే ముందుకు వస్తారు. వాళ్లవాళ్లూ సహకరిస్తారు. అలాకాకుండా వ్యక్తి మరణించిన తర్వాత వెళ్లి అవయవదానం గురించి చెబితే అర్థంచేసుకోలేరు సరికదా, అసలే మా వ్యక్తి చనిపోయి బాధలో మేముంటే ఈ గోలేమిటని కోపగించుకుంటారు. అందుకని చిన్న వయసు,నుంచే అందరికీ ఈ అవయవదాన ప్రాధాన్యత తెలిసేలా ప్రచారం సాగాలి. ఈ ప్రచారం ఒక ఉద్యమంలా సాగినప్పుడే అది సాధించగలం. ఉద్యమంలా సాగాలంటే అందరం భాగస్వాములు కావాలి.

ఒక్క విషయం గుర్తుంచుకోవాలి. ఇవాళ నేను డోనార్ని అనుకుంటున్నాను. రేపు రిసీవెంట్‌నీ కావచ్చు. అందరూ డోనార్స్ అయినప్పుడు రిసీవెంటయినా ఆరోగ్యలబ్ధి పొందగల్గుతాం కదా!

*

కథ

సామాన్యుడి స్వప్నం

దీప్తి

అర్ధరాత్రి హాయిగా నిద్రపోతున్న సునందను సుబ్రమణ్యం తట్టిలేపి మరీ కూర్చోబెట్టాడు.

ఆవలిస్తూ సగంకళ్లు తెరచి మంచానికి చతిగిలపడి కూర్చుని "అర్ధరాత్రి మద్దెల దరువేంటి బాబో..!" అంది.

"సుందు.. సుందూ.. మరే.. నాకో కలొచ్చింది. అది వింతగా, విచిత్రంగా ఉంది. నాకేం అర్థమైచావట్లేదు. నీకు చెప్తా.. కాస్త దానర్థం చెప్పవూ?!"

"ఇదెక్కడి గోల? నువ్వు సుబ్బరంగా నిద్రపోయి కలల అర్థం చెప్పమంటూ నా నిద్ర చెడగొడతావా? ఇదేం బాగాలేదుగాని పడుకో" అంటూనే ఠకీమని తను పడుకుంది.

సుబ్రమణ్యం పట్టువదలని విక్రమార్కుడిలా సునందను మళ్లీ మళ్లీ లేపుతూనే ఉన్నాడు. అతని పట్టుదలగురించి తెలిసిన సునంద ఈసారి తప్పనిసరై లేచి కూర్చొని కునికిపాట్లు పడుతూ "ఇహచెప్పు" అంది.

సుబ్రమణ్యం ఉత్సాహంగా మొదలెట్టాడు.

"ఆ... ఊ... అలాగా... ఆహా..." అంటూ కునికిపాట్ల మధ్యే సుబ్రమణ్యం చెప్పడంపూర్తయింది.

ఆఖర్న "ఇంతకీ దీని అర్థమేమిటంటావు?" అన్న సుబ్బును జాలిగా ఓ చూపు చూసి "నాకూ అర్థం కాలేదు. పొద్దున్నే ఎదురింటి పిన్నిగార్నడిగి చెప్తాన"ని గట్టిగా ముసుగుతన్ని పడుకుంది.

సుబ్రమణ్యానికి మాత్రం ఆరాత్రికిక నిద్రపట్టలేదు. ఆ కలనే తలచుకుని 'ఈ రహస్యం ఛేదించేవారెవరనే' ఆలోచనలతోనే నడిఝాము గడిచిపోయింది.

కాలం ఎవరికోసమూ ఆగదుకదా! రాత్రిగడవనూ గడిచింది. పొద్దు పొడవనూ పొడిచింది. కాని మన సుబ్బులుకే పాపం తెలతెలవారుతుండగా మాగన్నుగా నిద్రపట్టి సూర్యుడు చురుక్కున వాతపెట్టిందాకా కళ్లు తెరిపి పడలేదు.

అంతే... ఢన్‌మని మంచం మీదనుంచి దూకి, బాత్‌రూంలోకి ఉరికి ఏకంగా స్నానం కూడా కానిచ్చుకుని బయటపడ్డాడు.

"ఎదురింటి పిన్నిగారి దగ్గరికి పద" అన్నాడు సునందని.

"నన్ను నమ్ముకుని నాలుగు పొయ్యిలు... నాలుగు పొట్టలు ఎదురుచూస్తూ ఉన్నాయి. పొద్దున్నే నేనెక్కడికి వస్తాను? నువ్వే వెళ్లి స్వప్న రహస్యం ఛేదించుకో" అంది.

"ఎవరికోసమూ ఏ పనీ ఆగదు. అందునా నువ్వు రాకపోతే నా పని ఆగుతుందనుకున్నావా?" అని ఓ సవాలిసిరి ఎదిరింటికి దౌడు తీశాడు.

సుబ్బులు వెళ్లే సమయానికి ఇంటిముందు అరుగుమీద మండిగం వేసుకుని పేపర్లో మునిగిపోయి బాబాయిగారు, హాల్లో కూరగాయలు పోసుకుని తరుగుతూ పిన్నిగారు కనపడ్డారు. పైగా పిన్నిగారే సుబ్బుల్ని గమనించి "రావయ్యా సుబ్రమణ్యం..." అని ఆప్యాయంగా పిలిచారు.

మంచి శకునం అనుకుని సరాసరి పిన్నిగారి దగ్గరికెళ్లి కూర్చుని పిన్నిగారి చేతిలోంచి గోరుచిక్కుళ్ల బుట్టలాక్కుని వాటి పీచులు తీస్తూ రాత్రి జరిగిందంతా చెప్పుకొచ్చాడు.

ఆపాటికి కూరలు తరగడం అయిపోయింది. "అబ్బాయ్... ఈ కథ ఏదో వింతగానే ఉంది కానీ నాకిప్పుడు ఆలోచించే తీరిక లేదు. 'ఆంధ్రావని' వేళకల్లా టిఫిన్‌ప్లేటు చేతికందలేదనుకో అణుబాంబులు లేకుండానే భూగోళం బూడిదై పోతుంది" అంటూ కత్తిపీట తీసుకుని వంటింట్లోకి పోయింది.

పాపం సుబ్బుల్ని చూస్తే జాలేసిందేమో? వెనువెంటనే వచ్చి ఓ ధర్మసూక్ష్మం చెప్పారు. "ఇదిగో సుబ్రమణ్యం మీ బాబాయిగారికిప్పట్లో పనేం లేదు, నేను టిఫిన్ వండి పిలిచిందాకా! అప్పటిదాకా అదిగో అక్కడే కూర్చొని ఆ పేపరు నములుతూ మధ్యమధ్య టీ నంజుతూ ఉంటారు. ఆయన్ను పట్టుకున్నావా.. నీ పనైపోతుంది" అని చెప్పి మళ్లీ వంటింట్లోకెళ్లిపోయారు. ఇలా చెప్పటంలో సుబ్బులు మీద జాలే కాదు... వాళ్లాయన మీద కసి కూడా...!

ఎందుకంటే ఇన్నేళ్లుగా

చూస్తోంది రోజూ పొద్దున్నే పేపరు వాకిట్లో పడ్డం ఆలస్యం... అందుకుని అలా మండిగ వేసుకుని మొదటి పేజీలో 'ది హిందూ' లోగోదగ్గర్నుంచి ఆఖరి పేజీలో 'ప్రింటెడ్ అండ్ పబ్లిష్డ్ బై' దాకా చదివి తీరాల్సిందే. ఈ దీక్ష పూర్తయ్యేవరకూ సుడిగాలొచ్చినా, భూమి కంపించినా, మిన్ను విరిగి మీదపడ్డా కదలరు, ఉలకరు, పలకరు.

ఆవిడకు ఆ కూరలు తరిగేప్పుడే కాస్త వెసులుబాటు. ఆ సమయంలో ముఖ్యమైన విషయాలేవో ఆయనతో చెప్పాలని ప్రయత్నిస్తుంది కానీ అది సాగదు. ఆ తర్వాత పనిలోపడి తెమిలేసరికి ఆయనాఫీసుకు పోతారు. ఆఫీసు తర్వాత రాచకార్యాలన్నీ చక్కబెట్టుకొచ్చేసరికి అర్ధరాత్రి. ఇలా... చెప్పాలనుకునే విషయాలు చెప్పకుండానే నెలలు గడచిపోతాయి. చివరికి ఆవిడదే తప్పన్నట్టు వ్యంగ్యాస్త్రాలు...

ఏతావాతా పొద్దున్నే ఈ పేపరు చదివే కార్యక్రమం మానిపించాలని లక్షన్నొక్క ప్రయత్నాలు చేసి... అన్నీ వికటించి ఊరుకుంది.

ఖర్మగాలి ఎప్పుడన్నా పేపరు రాకపోతే వాకిట్లోకి, ఇంట్లోకి కాళ్ళరిగేలా తిరుగుతూ... అక్కడికి ఆవిడే పేపరు రాకుండా ఆపినట్టు నోరరిగేలా గొణుగుతూ ఉంటారు.

"ఆ పేపరేదో చదువుతూ కూర్చుంటే ఈగోల్లేకుండా తనన్నా ప్రశాంతంగా ఉండొచ్చు" అనుకునేది.

పొద్దున్నే కళ్ళు తెరవకుండానే దేవుణ్ణి వరాలు కోరితే అవి తీరుతాయని చిన్నప్పుడెప్పుడో బామ్మ చెప్పిన మాట గుర్తుపెట్టుకుని రోజూ పాటిస్తుందావిడ. కాని దేవుడిక్కూడా సిన్సియారిటీ లేనట్టుంది. ఆవిడ కోరే ముచ్చటైన మూడు వరాలు కొన్నిసార్లు తీరవు. ఇంతకీ అవేమిటంటే...

1. పేపరువాడు పేపరు వెయ్యాలి.
2. పాలవాడు పాలు తేవాలి.
3. పనివాడు పనికి రావాలి.

ఈయన్ను కట్టుకున్న నాటినుంచి ఈ మూడు కోరకుండా కన్ను తెరచిన పాపాన పోలేదు.

ఇదిగో ఇన్నాళ్ళకు ఆయనమీద కసి తీర్చుకోవటానికి సుబ్బులు సాధనమయ్యాడు.

సంతోషం ఓ పక్క... ఉత్కంఠ మరోపక్క... మనిషి వంటింట్లో ఉన్నా చెవులు వీధి అరుగుమీదే ఉన్నాయి.

సుబ్బులు మెల్లగా బాబాయి పక్కన చేరాడు. సకిలించాడు... ఇకిలించాడు... కాని లాభం లేదని తను కూడా ఆయన తల రాసుకుంటూ పేపర్లో తల దూర్చాడు. హెడ్‌లైన్స్‌ను పెద్దగా చదవటం మొదలుపెట్టాడు. అయినా ఫలితం లేకపోయింది. ఇలా అనేక విన్యాసాలు చేశాక... ఎట్టకేలకు ఆయనకూ పేపరు ముగించక తప్పలేదు. సుబ్బులు బాధ పడలేక 'నీ భక్తికి మెచ్చితి... ఏమి నీ కోరిక?' లెవెల్లో లుక్కిచ్చారు.

'తపము ఫలించిన శుభవేళ...' అనుకుంటూ తన కలనంతా ఏకబిగిని చెప్పాడు.

ఆయన అలాగే కూర్చొని పేపరు మడిచి ఎడంచేత పట్టుకుని కుడిచేత్తో టీవీలాగిస్తూ అలవోకగా ఓ అరనవ్వు నవ్వి "మళ్లీ చెప్పవోయ్" అన్నాడు.

మనవాడు బుర్ర గోక్కుంటూ మళ్లీ మొదలుపెట్టాడు.

"మనిషి తల, ఒంటెమెడ, మూపురం, రెండుకాళ్లు... ముందుకు పొడుచుకొచ్చిన కాళ్లు... ముఖంనుంచి చెమటకు బదులు రక్తం చుక్కలుచుక్కలుగా పడుతోంది. చెవులు చిల్లులుపడి జల్లెడగా ఉన్నాయి. వీపుకీ, పొట్టకీ తేడాలేదు. మూపురం మీద మూటలు చిన్నవి... పెద్దవి... రంగులవి... రకరకాలు, వాటిమీద ఏదో రాసుంది. అక్షరాలు కొన్ని కనపడుతున్నాయి... కొన్ని కనపడటం లేదు. అడుగు కదపలేకపోతున్నాయి. మందలుమందలుగా ఉన్నాయి. ఎవరో పొడుస్తుంటే భారంగా కదులుతున్నాయి. ఇంతలో మళ్లీ కొత్తమూటలు మూపురం మీద పడ్డాయి... అవి చతికిల పడిపోయాయి. ఎవరో గాల్లో తేలుతూ వచ్చి చిన్న వస్తువు వాటి మూపురంనుంచి తీస్తారు. వెంటనే అవిలేచి పరిగెడతాయి. మళ్లీ కొత్తమూటలు.. చతికిల పడటం... మళ్లీ అతిచిన్న వస్తువు తీయడం... ఉరకడం ఇలాగే మళ్లీమళ్లీ... పోగాపోగా... ఒంటెలాంటి మనిషి బదులు మొత్తం మూటలే కనబడతాయి..."

బాబాయిగారు పకపకా నవ్వారు. కడుపారా నవ్వారు. నవ్వుతూనే "ముందు మీ పిన్నిని పిలు" అన్నారు. ఆవిడ చెవులెలాగూ ఇక్కడే ఉన్నాయి కాబట్టి రానే వచ్చింది.

"ఏమోయ్... పేపరు చదవకుండానే లోకజ్ఞానం బోలెడు తెలుసంటావు కదా...! మన సుబ్బులు కల విప్పలేకపోయావూ...?" అంటూ సవాల్ విసిరారు. "నాకంత తెలివెక్కడేడిసింది. మీరంటే రోజూ పేపరు నమిలి మింగుతారుగా... చెప్పరాదూ?!" బదులు సవాలు విసిరింది.

'ఇదెక్కడిగోలరా బాబూ... పొద్దున్నే వీళ్లిద్దరిమధ్యా గొడవ పెట్టాను.. వెధవ కల.. వెధవ కలని..' తనని తానే తిట్టుకుంటూ ఇద్దరి ముఖాలూ మార్చి మార్చి చూస్తున్నాడు సుబ్బులు.

తపస్సుకు కనికరించి వరమిచ్చే ఫోజుతో "సుబ్బులూ, నీ కల చాలా గొప్పదోయ్... వాస్తవాలకు అద్దంపట్టేట్టుంది..." అన్నారు బాబాయిగారు.

'అబ్బో! పరవాలేదు. మన కల మరీ నాసిరకం కాదన్నమాట...' అని మనసులో తెగ సంబరపడిపోయాడు.

"మూపురంమీది మూటలంటే అప్పులు.. వడ్డీలు.. ధరలు.. పన్నులు.. గాలిలో ఎగిరేవాళ్లకు, రాజకీయనాయకులకు పోలికలున్నాయా...?" అనడిగారు బాబాయ్‌గారు.

"ఆ... ఆ... ఔను..." అంటూ బదులిచ్చాడు సుబ్రమణ్యం.

"అంటే నీకు ముందే అర్థమైందా ఆయన ఆక్రోశం?"

"అర్థం కాకపోవడమేంటి... సుబ్బులు చెప్పినప్పుడే అర్థమైంది. మీ పేపరు తపస్సును ఒక్కరోజైనా భంగపరచాలని సుబ్బుల్ని ప్రయోగించా.." అన్నారావిడ గర్వంగా.

"అయితే వివరం చెప్పు చూద్దాం"

"చూసేదేమిటి? ఓపక్క అనుభవిస్తుంటే... ఆ ఒంటెలాంటి మనుషులం మనం కాదూ...! ఎప్పటికప్పుడు ధరలు పెంచుతూ, పన్నులు పెంచుతూండటమే కొత్తగా చేరే మూటలు..."

"పెంచాలనుకునేదాని కంటే కాస్త ఎక్కువే పెంచటం... జనం కోపంకొద్దీ బస్సులూగట్రా తగలేయటం.. రైళ్లరోకించడం.. గొంతులు చించుకోవడం.. దిష్టిబొమ్మలు తగలేయటం.. పోలీసుల లాఠీలు విరగటం... జనం తలలు పగలటం... సందట్లో సడేమియాగా దోపిడీలు.. దొమ్మీలు... నాలుగు రోజులయ్యాక ప్రభుత్వం దిగొచ్చి పావలో... పరకో... (తను అనుకున్నదాని కంటే తగ్గకుండా) పెంచినధరలు తగ్గించటం.. ఇదంతా మన ప్రజ్ఞే అనుకుని మళ్ళీ చల్లబడిపోతాం.. అంతేగా"

"మరి మన మూపులమీంచి మూటలు దిగి మనం మనుషులం ఎప్పుడవుతాం?' మనసులో అనుకున్నాననుకుని పైకే అన్నాడు సుబ్బులు.

"పావురాల్లా అందరం కలిసి ఒక్క పెట్టున ఒళ్లు విదిలిస్తే మూటలన్నీ అవే పడిపోతాయ్" అని, ఆగకుండా అరుస్తున్న కుక్కరు నోరు నొక్కడానికి వంటింట్లోకెళ్లారు పిన్నిగారు. ఈసారి అవాక్కవడం బాబాయిగారి వంతయింది.

*

సెన్సూ కామన్ సెన్సు

బేరసారాలు

రుక్మిణి

ప్రతి ఇంట్లోనూ నిత్యం ఏదోఒక 'బేరం'.. రోజూ కాకున్నా వారానికి రెండు మూడు సార్లయినా చేయకతప్పదు. బేరం అనగానే భారీ ఎత్తున సూపర్ డూపర్ మార్కెట్లు లేదా స్టోరుల్లోనే కాదు, ఉదయం లేచిన దగ్గర్నుండీ ఏదో ఒక వస్తువు కుటుంబానికి అవసరం పడకమానదు. వాటిని కొనకా తప్పదు.

ఈ కొనడం... అమ్మడం... చేసేప్పుడు డబ్బు... ధర... ప్రధానం. దీంతో వస్తువు, డబ్బులు మారకమవుతాయి. ఈ విద్యలో నేను పనికిమాలిన వాడినని మా ఆవిడ ప్రగాఢ నమ్మకం.

"ఆc... మీకు బేరం చేయడం బొత్తిగా చేతగాదు. అమ్మేవాడు ఎంత రేటు చెప్తే అంత డబ్బూ పారేసి కొనిపారేస్తారు. ఎంత నష్టం. అదే మేమైతేనా... ఆలోచించీ... విచారించీ... గీసులాడి బేరం చేసి కొంటాం" అంటుంది.

ఇందులో పాక్షిక సత్యం కూడా లేకపోలేదు. దానికి నా అనుభవాలు ఉదాహరణలుగా కూడా చెప్పగలను.

కూరగాయలు తెమ్మని పొద్దున్నే నన్ను మార్కెట్‌కు పంపిస్తుంది. నేను గబగబా బెండకాయలూ... టమాటాలూ... ఇంకేవో కనిపించినవి ఆదరాబాదరాగా... ఆ కూరలమ్మేవారు చెప్పే రేటుకే కొని బ్యాగులో వేసుకుని బండెక్కుతాను.

"హవ్వ... ఎవరండీ మీకు కుచ్చు టోపీ తగిలించిందీ... బెండకాయలు పావుకిలో ఐదా... అరె...టమాటాలు ఆర్రూపాయలా... సంబడం బాగానే ఉంది. ఎదురింటి బాబాయిగారు మూడ్రూపాయలకు బెండకాయలూ, నాల్రూపాయలకే టమాటాలూ తెచ్చారు. మొత్తానికి మూడు రూపాయల నష్టం...!"

ఈ ఎత్తిపొడుపులు భరించలేక పేపర్లోకి దూరిపోయాను. బేరాలు చేసుకుంటూ కూర్చోడానికి నాకవతల ఆఫీసు పనుంది. ఎదిరింటాయనేమో రిటైర్డ్... ఎంతసేపైనా గీసులాడతాడు. తర్వాత వంటింట్లో నుండి ఆర్తనాదం... ఓ గిన్నెలో నాలుగైదు బెండకాయలూ... రెండు టమాటాలతో... దానివెంటే ఆవిడగారూ ప్రత్యక్షమైంది.

"ఏంటివీ... చచ్చులూపుచ్చులూ, ముదుర్లూనా? అంత రేటు పోసి ఇంత నాసివా తెచ్చేది?'' అంటూ బెండకాయలు, టమాటాలూ పట్టుకుని బుసలుకొడ్తూ నిల్చుంది.

"..ఇవి డబ్బుపోసి కొన్నవేగా... ఉత్తపుణ్యానికి వచ్చినవి కాదుగా... ఈపుచ్చిపోయిన, ముదిరిపోయిన వాటిని ఏం చేసుకోవాలి? మీరు తేవడం మూలంగా ధరా... ఎక్కువే. సగం పనికిరానివీనూ... ఇలా అయితే ఇక సంసారం ఏం వెలగబెట్టాం.. ఖర్మ?! ఇంక జన్మలో తమరు మార్కెట్‌కేసి వెళ్ళనక్కర్లేద"ని తేల్చిపారేసింది.

ఉదయమే మా వీధిలోకి తోపుడు బళ్ళమీదా, నెత్తిమీద బుట్టలలో కూరగాయలమ్మడానికి వస్తారు. మా ఆవిడ వాళ్లతో బేరాలాడ్డం.. అదొక గొప్ప దృశ్యం, రసవత్తర సన్నివేశమూనూ... మంచి కాలక్షేపం...

"క్యాబేజీ ఎంత?"

"నాల్రూపాయలు"

"కిలో నాల్గురూపాయలా?"

"ఇంకానయంలే, పావుకిలో నాల్గు... కిలో పదహారు రూపాయలు"

"అబ్బో తెలివి... మా పక్కింటి బాబాయిగారు నిన్ననే తెచ్చారు ఎనిమిదికి..." అనిచెప్పి సగానికి సగం బేరం పెట్టింది. దాంతో కూరగాయలావిడ ఒక్క ఉదుటున తట్ట లేపి వెళ్లబోయింది.

"అరె... అరె... అంత తొందరైతే ఎట్లా... పోనీ పదికివ్వు"

"కొనేరకమే..." అంటూ చురచురలాడుతూ కూరలమ్మ వెళ్లిపోయింది.

ప్రతి ఉదయమూ ఇలాంటి ఘటనలు కాసేపైనా జరుగుతాయి. నాలో మీటరు పెరిగిపోతుంది. ఓ కేకేసి మా ఆవిడను పిలుస్తాను. "అసలు నువ్వీరోజు వండిపెట్టేదేమైనా ఉందా... ఆఫీసుకు టైం కూడా అవుతోంది. ఎంతోకొంతకి తీసుకో. వాళ్లు బేరం చేసుకుని బతికేవారే కదా... కిడితే ఇవ్వరా? అంతలా పీచుబేరమాడాలా? అయినా వాళ్ళేం వేలకు వేలు దోచుకోవడం లేదు కదా... ఒక రూపాయికోసం వెళ్లగొడతావు... తరువాత కూరగాయలవాడు రాకపోతే... ఏం వండుతావు?

"అంటే పైసలు చెట్లకు కాస్తున్నాయా? అయినా బేరం చేస్తే మీకేం పోయిందీ... ఇలా అయితే ఇక ఈ సంసారం గట్టెక్కినట్టే...! వెధవగోల... అయినా నాకెందుకు?" అంటూ కస్సుబుస్సుమని మా ఆవిడ లేస్తుంది. తుఫానూ... సునామీ... మొదలన్నమాట. "ఏ వస్తువునైనా అమ్మేవాడు చెప్పేరేటు ఎక్కువ. వాళ్ళు ఎంతకీ మనల్ని దోచుకునే యావలోనే ఉంటారు కనుక తగ్గించి తీసుకోవాలి. దాంతో మనం చాలామటుకు ఆ 'దోపిడీ' నుండి రక్షింపబడతాం" ఇదీ మా ఆవిడ సిద్ధాంతం... ఏం చేస్తాం?!

పొరపాటున ఎప్పుడైనా షాపింగుకు వెళ్ళినా ఇలాంటి చేదు అనుభవాలే... అసలు బేరసారాలొద్దని, ధర తగ్గించమని అడగవద్దనీ... వాళ్ళు చెప్పిన రేటే కరాఖండీ అనీ... కాదు నాఉద్దేశం. అయితే కాస్తంత హేతుబద్ధంగా ఆలోచించాలి. కొన్ని వస్తువులు వందా... వందాయాభై చెప్తారు. వస్తువు... ప్రదేశం... నాణ్యత... వగైరాలను బట్టి సగానికి సగం అడిగినా తప్పులేదు. కోఠీలో సాక్సు యాభై రూపాయలు చెప్పి పదిహేను రూపాయలకిచ్చాడు. లెదర్ బెల్టు డెబ్బైరూపాయలు చెప్పి ఇరవైఐదు రూపాయలకిచ్చాడు. దాని మతలబు మనకు తెలుసుననేది సారాంశం. కానీ పచారీ కొట్లలోనూ, చిల్లర దుకాణాల్లోనూ, షాపింగ్ మాల్స్‌లోనూ ఇది బెడిసికొడుతుంది.

ఈమధ్య రెగ్యులర్‌గా మా బజారుకు వచ్చే కూరగాయలమ్మితో మా ఆవిడ బేరాలు చకచకా సెటిలయిపోతున్నాయి. కారణం పక్కింటి బాబాయిగారు కాలు విరిగి మంచం పట్టడంతో మా ఆవిడకు అసలురేట్లు తెలీకుండా పోయాయి. దాంతో ఈవిడ సగానికి సగం కాకుండా కొద్దిగా తగ్గించి అడుగుతోంది. అందుకామె లోపల తిట్టుకునో, బయటకు గొణుక్కునో... మొత్తానికి ఇచ్చేస్తోంది. దానికి మా ఆవిడ ఆనందం చెప్పనలవి కాదు. ఉదాహరణకు వాళ్లు అమ్మాల్సినదాని అసలు ఖరీదు పదయితే మా ఆవిడకు పన్నెండని చెప్తారు. ఈవిడ గుర్రుగా పదంటుంది. వాళ్లు యమా నష్టపోతున్నట్లు కాసేపు నటించి, చివరికిచ్చేసి బుట్టనెత్తుకుని 'వంకాయలు, దోసకాయలు...' అని అరుచుకుంటూ పోతారు.

ఏంచేస్తాం, మొత్తం ప్రపంచం వ్యాపారమయమైపోయిందాయే...

*

టీ బ్రేక్

ఎం.వి.ఎస్. శర్మ

వెర్రి చూపు



ఏభై ఏళ్ల తాయారు, అప్పుడే రిటైరయిన భర్త విశ్వాసరావు, కొత్తగా పెళ్లైన వాళ్ల కొడుకు కోడలుతో మాయాపురం వచ్చి అద్దింట్లో దిగారు. కోడలు, అత్త, మావగారు కొత్తిల్లు సర్దుతూవుంటే అటకమీద పాత లాంతరొకటి దొరికింది. అల్లావుద్దీన్ అద్భుతదీపం కథ గుర్తొచ్చిన విశ్వాసరావు ఆ లాంతరును బయట పారేయబోతున్న తాయారును వారించి చేతిలోకి తీసుకున్నాడు. కాస్త చింతపండు తెచ్చి లాంతరును రుద్దడం మొదలెట్టాడు.

నిజంగానే ఓ భూతం ప్రత్యక్షమైంది. ముగ్గురికీ తాను తలా ఒక్క వరమే ఇస్తానని, ఇష్టమొచ్చింది కోరుకోమని ఆఫరిచ్చింది.

నేను ముందంటే నేను ముందని ముగ్గురూ తగువులాడుకోవడం మొదలెట్టారు.

ముగ్గుర్నీ ఊరుకోబెట్టడానికి భూతం నానాతంటాలూ పడింది.

చిన్నపిల్లగాబట్టి కోడలికే ముందుఛాన్సిమ్మనమని సిఫార్సు చేసింది.

అత్త, మావ ఒప్పుకున్నారు.

కొత్తకోడలు హుషారుగా “నేనూ, మా ఆయన ఆర్నెల్లు స్విట్జర్లాండ్‌లో, ఆర్నెల్లు ఫ్రాన్స్‌లో ఇంకా అలాంటి చాలా దేశాల్లో విహారయాత్ర చేయాలి” అని కోరింది.

“తథాస్తు” అంది భూతం.

వెంటనే కోడలు అదృశ్యమైపోయింది.

ఆఫీసుకెళ్లిన కొడుకూ అదృశ్యమైపోయాడు.

ఇద్దరూ జంటగా స్విట్జర్లాండ్‌లో తేలారు.

ఆ తర్వాత వంతుకోసం తాయారుతో తగువుకి దిగిన విశ్వాసరావును భూతం వారించడానికి ప్రయత్నించింది. తాయారుకి ముందుఛాన్సివ్వడానికి విశ్వాసరావు ససేమిరా ఒప్పుకోలేదు.

“లాంతరును తోమిందే నేను. నాదే ముందు ఛాన్సు” అన్నాడు.

“సరే నీ ఖర్మ” అంది భూతం.

భర్తతో వాదించి ఉగ్రరూపం దాల్చిన తాయారు తాటకిలా కనపడిందో ఏమో, విశ్వాసరావు గబుక్కున “నేనూ, మలైకా అరోరా ప్రపంచంలోకెల్లా ఖరీదైన స్టార్‌హోటల్లో సంవత్సరంపాటు జల్సాచేయాలి” అనేశాడు.

భూతం “తథాస్తు” అంది.

అంతే విశ్వాసరావు మాయం.

అక్కడ తేలి మలైకా అరోరాను ఏసీరూమ్‌లో పలకరించబోయాడో లేదో విశ్వాసరావుముందు మెరుపు మెరిసింది.

కళ్లు తెరచేసరికి మళ్లీ తాయారు ముందున్నాడు.

“ఇదేంటి?” అని వణుకుతూ అడిగాడు విశ్వాసరావు.

“నేను ముందే చెప్పానా? మీ అవిడకే ముందుఛాన్స్ వదిలెయ్యమని? విన్నావా? ఇప్పుడు చేయగలిగిందేమీ లేదు, అఘోరించు” అని భూతం అదృశ్యమైంది.

తనవైపు బిక్కముఖం వేసుకుని చూస్తున్న విశ్వాసరావుతో “స్టార్ హోటల్లో ఉన్న మిమ్మల్ని అర్జెంటుగా నాముందు నిలబెట్టమన్నదే నేను ముచ్చటగా కోరిన కోరిక. అర్థమైందా...! ఆ వెర్రి చూపులు మాని బైట ఆరబెట్టిన గుడ్డలు మడతపెట్టి సర్దండి. తేడా వొస్తే వూరుకోను” అంది తాయారు.

*

మనసా... తెలుసా?

కౌన్సెలింగ్ సైకాలజిస్ట్, పర్సనాలిటీ డెవలప్‌మెంట్ ట్రైనర్, ఫోన్ : 9849130141

హిప్నో కమలాకర్

నా చిన్నపుడే తండ్రి మరణించారు. మా తల్లి నన్ను, తమ్ముడ్ని, చెల్లెల్ని పెంచింది. కష్టపడి చదివించింది. నేను చిన్నపుడు కష్టపడి చదివే అలవాటు. నేను 10వ తరగతి నుండి కష్టపడి పనిచేసుకోవడం, చదువుకోవడం జరిగింది. 10వ తరగతిలో మా అమ్మకు బాగోలేదు. అప్పట్నుంచి పనిచేయడం, అమ్మకు సాయంగా ఉండేవాడిని. తరువాత అతికష్టం మీద ఇంటర్ పూర్తి చేసి డిగ్రీలో ప్రవేశం పొందాను. బికాం డిగ్రీ ఫస్ట్ ఇయర్‌లో కొన్నిరోజులు కాలేజీకి, కొన్ని రోజులు పనికి పోయేవాడిని. వాటి పైసలుతో బుక్స్ కొని చదివేవాడిని. నల్లగొండ కాలేజిలో పరీక్షలు రాయడం, అమ్మ చికిత్స నిమిత్తం హైదరాబాద్ పోవడం జరిగింది. అయినా కూడా ఫస్ట్ ఇయర్ పూర్తి చేశాను. సెకండియర్ అడ్మిషన్‌లో చేరాను. ఇబ్బందులు ఇంకా వెంటాడుతూనే ఉన్నాయి. మా బాబాయికి బ్రెయిన్ ట్యూమర్ వ్యాధికారణంగా చనిపోయాడు. తరువాత ఫైనల్ ఇయర్ ఎగ్జామ్స్ పదిరోజుల ముందు అమ్మ చనిపోయింది. పరీక్షల సమయం. ఈ పరిస్థితులుల్లో నాకు మైండ్ అప్‌సెట్ అయింది. అప్పట్నుంచి నేను ఎంత చదివినా డిగ్రీ పూర్తి కాలేదు. దయచేసి నా జీవితంలో ఆశ కల్పించగలరని నా మనవి. నాకు 'లా' చేయడం చాలా ఇష్టం. దయచేసి 'లా' భవిష్యత్తు గురించి తెలియచేయగలరు.

వేంకటేశ్వరరావు, అచ్చంపేట.

నీ కుటుంబ, ఆర్థిక పరిస్థితులను సమీక్షించినపుడు బియల్ చదవటం నీకు అంత లాభాదాయకం కాదు. ఒకవేళ నువు బియల్ చదివినా 5 నుంచి 10 సంవత్సరాల సీనియర్ లాయర్‌వద్ద అసిస్టెంట్‌గా పనిచేస్తేనే గాని స్వతంత్రంగా ప్రాక్టీసు చేయలేవు. ఆర్థికంగా నిలదొక్కుకోనూ లేవు. నీవు బికాం చదువుతున్నావు కాబట్టి, అది పూర్తిచేసి ఏదైనా అకౌంట్స్ ప్యాకేజీ నేర్చుకో. ఎవరైనా చార్టర్ అకౌంట్ వద్ద నీకు మంచి ఉద్యోగం దొరుకుతుంది. మంచి జీతం కూడా వస్తుంది. అపుడు ఆర్థిక సమస్యలు ఉండవు. కాబట్టి ఈవినింగ్ కాలేజ బియల్‌లో జాయిన్ అవ్వు. నీ బియల్ పూర్తయ్యేటప్పటికి చార్టర్ అకౌంటెంట్ వద్ద అకౌంట్స్‌లో నువు సంపాదించిన అనుభవంతో టాక్సేషన్‌లో అనుభవం ఉన్న లాయర్‌గా వెంటనే అద్భుతమైన గుర్తింపు పొందుతావు. 5 నుంచి 10 సం॥లు వేచి ఉండాల్సిన అవసరం కూడా ఉండదు. అనంతరం నీ పరిధిని సివిల్, క్రిమినల్ 'లా' లో కూడా విస్తృతం చేసుకోవచ్చు. నీ జీవిత లక్ష్యం నెరవేరుతుంది.

చాలాబాగా చదువుకునే నేను ఈ మధ్య కాన్సన్ట్రేషన్‌తో చదవడం లేదు. నాకు ఇంటర్మీడియట్‌లో 93% మార్కులు వచ్చాయి. ప్రస్తుతం నేను డివిఎస్సీకి ప్రిపేర్ అవుతున్నాను. నేను కొద్దిగా నల్లగా ఉంటాను. ఈ కారణం వలన నేను సరిగా చదువలేకపోతున్నాను. నలుగురిలోకి వెళ్ళాలంటే ఇబ్బంది పడుతున్నాను. ఎప్పుడూ అదే ఆలోచనతో బాధపడుతున్నాను. నాపై నాకు ఆత్మవిశ్వాసం తగ్గుతోంది. ఏ పనిచేసినా సంపూర్ణంగా చేయలేకపోతున్నాను. ఇంట్లోంచి బయటకు వెళ్ళాలన్నా, ఎవరితోనైనా మాట్లాడాలన్నా భయం, నల్లగా ఉండటం అవరోధం కాబోదని మీరు సలహాలు ఇస్తున్నారు. అవి చదివినప్పటికీ నాలో మాత్రం ఆ భావన అలాగే ఉంటోంది. రాను రాను ఈ ఆలోచనలతో పిచ్చివచ్చేట్టు ఉంది. నాకు సైకాలజిస్టుల దగ్గరకు వెళ్ళి కౌన్సెలింగ్ తీసుకునేంత స్థోమత కూడా లేదు. నా సమస్యకు తగిన సలహా ఇస్తారని వేయికళ్ళతో ఎదురుచూస్తున్నాను.

ప్రసాద్, కొవ్వూరు.

మీలో ఇన్ఫీరియారిటీ కాంప్లెక్స్, సోషల్ ఫోబియో అధికంగా ఉన్నాయి. రంగు, అందం, ఆకృతి క్షణకాలం మాత్రమే ఇతరులను ప్రభావితం చేస్తాయి. శాశ్వతంగా ఇతరులను ఆకట్టుకునేలా చేసేవి మీ సామర్థ్యాలే విభిన్న విషయాల్లో మీ నైపుణ్యాలు మరింతగా పెంపొందించుకోవడం ద్వారా సమాజం కోరుకునే వ్యక్తిగా మీరు మారగల్గుతారు. మీ జ్ఞానాన్ని ఇతరులకు అర్థం అయ్యేవిధంగా చెప్పగల్గడం, ఇతరులు చదివి అర్థం చేసుకునేలా వ్రాయగల్గడం, మీ నైపుణ్యాన్ని ఇతరులకు ప్రయోజనం కలిగే విధంగా ప్రదర్శించడం వంటి మూడు అంశాలు మిమ్మల్ని ఏ రంగంలో అయినా శిఖరాగ్రానికి చేరుస్తాయి. కాబట్టి మీ జ్ఞానాన్ని, మీ నైపుణ్యాలను మరింతగా పెంపొందించుకోవడం మీద దృష్టిని కేంద్రీకరించండి. అపుడు తెల్లగాను, అందంగాను ఉన్నవాళ్ళందరూ మిమ్మల్ని చూసి అవాక్కైపోతారు.

సమస్యలకు ఆహ్వానం

మీకు లేదా మీవాళ్ళకు మానసికమైన సమ్యలేమైనా తలెత్తాయా? ఏం చేయాలో పాలుపోక సతమతమవుతున్నారా? అయితే వెంటనే ఆ సమస్యేంటో మాకు తెలియజేయండి. సైకాలజిస్ట్ **శ్రీ హిప్నోకమలాకర్** తగిన పరిష్కారాన్ని తెలియజేస్తారు.

మా చిరునామా: ప్రజాశక్తి ఆదివారం అనుబంధం, స్ట్రీట్ నెంబర్: 1, అశోక్ నగర్, హైదరాబాద్ - 500 020.



అవీ... ఇవీ

అదీ సంగతి

ఇద్దరు సైకియాట్రిస్టులు చాలా సంవత్సరాల తర్వాత కలుసుకున్నారు. వాళ్ళిద్దరూ సమవయస్కులే ఐనప్పటికీ హరి ముఖం వడిలిపోయినట్లుండి పదేళ్ళు పెద్దవాడిలా కనిపిస్తున్నాడు. శ్రీకాంత్ వదనం మాత్రం ఎంతో తేటగా వుండి వున్న వయసుకంటే చిన్నవాడిలా కనిపిస్తున్నాడు.

శ్రీకాంత్: ఏంటి హరీ, ఏం బాధ్యతలు మోస్తున్నావని మరీ ముసలివాడిలా తయారయ్యావ్?!

హరి: ఏముంది, పేషంట్లందరి కష్టనష్టాలూ వినీవినీ పెద్దరికం వచ్చేసిందిలే. సరే, నీ సంగతేంటి.. భలే స్మార్ట్‌గా, కాలేజ్ కుర్రాడివంటే నమ్మేట్లున్నావ్?

శ్రీకాంత్: నీలాగా అవన్నీ విననంతే!!!

శాలువా తెస్తాను

తండ్రీకొడుకుల సంభాషణ ఇలా సాగుతోంది.

సీతయ్య: ఇదిగో, విను.. తండ్రిగా నీ మంచి కోరే ఈ సంబంధం ఖాయంచేశాను. ఆ అమ్మాయి కులవతి, ధనవతే కాదు గుణవతి కూడా

సురేష్: గర్భవతి కూడా అయినా నేను చేసుకోలేను

సీతయ్య: కుళ్ళుజోకులేశావంటే మాడు చితుకుద్ది జాగ్రత్త

సురేష్: ఏం పర్లేదు, ఇంట్లో కూడా హెల్మెట్ పెట్టుకుంటాను

సీతయ్య: ఏమనుకుంటున్నావో, నా ఆస్తిలో చిల్లిగవ్వ కూడా ఇవ్వను

సురేష్: అరిగిపోయిన తెలుగుసినిమా డైలాగది..

సీతయ్య: ఆటకాయతనంగా వుందా? నా ఆస్తి అనాథాశ్రమానికైనా రాసిస్తాగానీ, నీకు రాయను

సురేష్: థాంక్యూ సోమచ్

సీతయ్య: మాటవరసక్కాదు

సురేష్: నీలో అంత ఔదార్యముంటే అంతకంటే కావల్సిందేంటి?

సీతయ్య: ఆ?!

సురేష్: ఆఫ్టరాల్, శాఖాబేధమని సుధతో పెళ్ళికి ఒప్పుకోనివాడివి కులమూగోత్రమూ, దిక్కూదివాణమూ లేని పిల్లలకి ఆస్తి రాస్తావా? సరే ఇప్పుడే వెళ్ళి స్టాంపుపేపర్లు, శాలువా కొనితెస్తాను.

- ఎన్నార్



కొత్త పుస్తకాలు

సొంపైన శ్వేతపత్రం



అడిగోపుల వెంకటరత్నం సీనియర్ కవి. తన నిరంతర కవితా వ్యవసాయంతో కాలంతో పోటీపడుతూ పలు కవితా సంపుటాలను వెలువరించారు. ఆయన కేవలం కాలక్షేపంకోసం కవిత్వం రాసే వ్యక్తి కాదు. సామాజిక మార్పును కాంక్షిస్తూ నిబద్ధతతో రాస్తున్న కవి. ఆయన వెలువరించిన కవితా సంపుటాలు అట్ట వెనక పేజీలో రచయిత ఫొటోతోపాటు కనిపిస్తూ పాఠకుల్ని ఆశ్చర్యానికి గురిచేస్తాయి. ఇప్పటికే సాహిత్యలోకంలో నిబద్ధ కవిగా సుపరిచితులైన అడిగోపుల తాజా కవితా సంపుటి శ్వేతపత్రం. ఈ సంపుటిలోని కవితలు చాలావరకు సంపుటి పేరును సార్థకంచేస్తూ సమాజంలో వున్న ఎన్నో లోపాలను కవితారూపంలో పారదర్శకంగా చూపిస్తాయి. అధికార రాజకీయ వ్యవస్థల స్వార్థపూరిత రాజకీయాలవల్ల దిగజారిన వ్యవస్థపై రాసిన కవితలే ఈ శ్వేతపత్రం సంపుటి.

ఈ పుస్తకంలోని ప్రతీ కవితా రచయిత సమగ్రదృక్పథాన్ని ప్రతిబింబించేదే. సామాజిక అహగాహన సమృద్ధిగా ఉన్న కవికి వస్తువుకు కొరత ఉండదు అననడానికి ఈ కవితా సంపుటే నిదర్శనం. మనిషి బాల్యం నుంచి వృద్ధాప్యం వరకూ అనేక విషయాలను రచయిత కవితా వస్తువులుగా స్వీకరించాడు. ఇక మనిషిపై తీవ్రప్రభావం చూపే పలు సామాజిక విషయాలపై రచయిత కవితా స్పందన అభినందనీయమైనది. ఇందులో ఎక్కడా వాగ్వివాదాలకు అవకాశంలేదు. రచయిత తన సామాజిక చింతన వ్యక్తీకరణకు కవిత్వాన్ని ఒక సాధనంగా చేసుకున్నాడు. కవి నిజాయితీకి, సామాజిక మార్పును తీవ్రంగా కాంక్షించే తీరుకు ఇంతకన్నా నిదర్శనం ఏముంటుంది? అక్షరాలను నేర్చిన మనిషి చిలకపలుకులు పలకడం వేరు. అక్షర శక్తిని అర్థం చేసుకున్న కవి దృష్టివేరు. 'పుస్తకం నిద్రించదు/పుస్తకం మరణించదు/విజ్ఞానం వెదజల్లి/విశ్వదర్శనం చేయిస్తుంది/అరుదైన గ్రంథాలతో/మనిషి నూరేళ్ళ జీవితం/నిండు ఆవిష్కరణ కోరి/పఠనానికి స్వాగతం పలుకుతుంది/పాతపుస్తకాలయం' అంటారొచోట. అక్షరాలపట్ల, పుస్తకాల పట్ల అడిగోపులకు వున్న అపార విశ్వాసం మనకీ పంక్తులలో కనపడ్తుంది. సహజంగానే అనుభవం పెరిగే కొద్దీ కవులు చిన్ని పదాలలో లోతైన అర్థాన్ని, అందరికీ అర్థమయ్యే సులువైన ప్రతీకలతో వ్యక్తీకరణను సాధిస్తారు. ఈ సంపుటిలలోని కవిత్వం నిండా అటువంటి ప్రయత్నం కనిపిస్తుంది. పై పంచె లేని దేహంపై నులక(మంచం) తాళ్ళ ముద్రలను ఒక బడుగు రైతు దేహంపై ముద్రింపబడటాన్ని కవిత్వీకరించిన తీరును గమనిద్దాం. 'ఒంటి మీద నులక మంచం వాతలు/ పైపంచె కింద దాచి/పొలానికి పయనమయ్యాను/ఇంట్లో పొలం దిగులు/పొలంలో ఇంటి దిగులు'. వస్తువుకి తగ్గ సాధారణ ప్రతీకలతో కవితను సహజత్వం ఉట్టిపడేలా రాయడం చేయితిరిగిన కవికి సుసాధ్యం.

వృద్ధాప్యం గురించి కవి రాసిన తీరు పాఠకులను కదిలిస్తుంది. 'సూర్యుడి కళ్ళలోకి సూటిగా చూసిన కళ్ళు/కనురెప్పల గూటిలో ఎండుగవ్వలై/చూపుకు తెరకట్టాయి/ఒక చేత్తో మోపు ఒక చేత్తో పన/అవలీలగా ఎగరేసిన చేతులు/ కూటి ముద్దను నోటికి మొయ్యలేక/ శరీరానికి బరువయ్యాయి/ముఖం ముడతల కొండల్లో / వయసు సూర్యుడు వాలుతున్నాడు'. కవి తనను కలతపెట్టిన ఏ విషయాన్ని కవితావస్తువుగా తీసుకున్నా ఆ కవితలో తన స్వరాన్ని కాస్త తీవ్రంగా వినిపించడం కనిపిస్తుంటుంది. 'మాట మౌనమై బిల్లు మాట్లాడుతుంది/- .. - .. -/బిల్లు గాయం చెయ్యక మానదు/అక్కడ డబ్బు స్వాగతిస్తుంది/డబ్బు పరామర్శిస్తుంది/డబ్బు వీడ్కోలు చెబుతుంది!'అంటాడు. కార్పోరేట్ ఆసుపత్రుల కథలను ఎంత చెప్పినా తక్కువే. మానవుడికి శారీరక ఇబ్బందులలోనే వ్యవస్థ సహకారం అవసరమవుతుంది. మానవీయ దృక్పథం కలిగిన వ్యవస్థ మనిషి నిస్సహాయ స్థితిలో ఉన్నప్పుడు చేయూతవుతుంది. కానీ డబ్బు పరామర్శించడం, డబ్బు వీడ్కోలు చెప్పడం ఈ మార్కెట్ వ్యవస్థ అమానవీయ దృక్పథానికి పరాకాష్ట. ఈ పరిస్థితిని కవి ఎండగట్టిన తీరు ప్రశంసనీయం.

కవి కేవలం ప్రతీకల పదబంధాలతో కవిత్వానుభూతిని అందించడమే కాదు పాఠకులకు కాస్తంత కర్తవ్య బోధన కూడా చేస్తాడు. 'ఒక అణుబాంబు/లక్ష మెదళ్ళ వినాశనం/ఒక అక్షరాయుధం/లక్ష బాంబుల నిర్వీర్యం/అవ్యవస్థపై ఆగ్రహం సంధింపుకు/వయోభేదం ఉండదు/అధిక్షేపణ ధిక్కారం తిరుగుబాటు/ అందరూ ధరించాల్సిన ఆయుధాలు' అంటూ బాధ్యత అవసరాన్ని గుర్తుచేయకుండా కవి ఉండలేకపోవడాన్ని గమనిస్తాం.

ఇందులో వున్న కవితలన్నీ కూడా తీవ్ర వేదనతో రాసినవే. అలాగని నిస్పృహ కలిగించే కవిత్వం కాదు. ఆలోచనలకు నాందిపలికి ఆచరణకు పురికొల్పే దిశగా పాఠకుడిని నెట్టే కవిత్వం ఈ శ్వేతపత్రం.

సీరియస్‌గా రాసిన కవిత్వమైనా ఆహ్లాదకరమైన అనుభూతిని కలిగిస్తాడు కవి. కవర్ పేజీ మీద బొమ్మ అందుకు నిదర్శనం. ఆహ్లాదకరమైన దృశ్యాన్ని కవర్‌పేజీగా రూపొందించడమే కాకుండా లోపల పేజీలలోని కవితలను చదవడానికి అనుకూలంగా, పొందికగా తీర్చిదిద్దడంలో కూడా శ్రద్ధ కనపడుతుంది. సామాజిక సమస్యలను కవన సౌందర్యంతో తనలో ఇముడ్చుకున్న శ్వేత పత్రం కవితా సంపుటి అందరూ చదవదగ్గ ఒక మంచి పుస్తకం.

- వొరప్రసాద్

(శ్వేతపత్రం కవితా సంపుటి, అడిగోపుల వెంకటరత్నం, పేజీలు: 106, వెల: రూ.40/-, ప్రతులకు: ప్రజాశక్తి బుక్‌హౌస్, చిక్కడపల్లి, హైదరాబాద్, విశాలాంధ్ర బుక్ హౌస్, హైద్రాబాద్)

విశ్వాసమే శ్వాసగా...

ఓ విజేత గమనం

రచన : డా॥ ఎల్. శ్రీనాథ్

వెల : 100/-, పేజీలు : 120

ప్రతులకు : శ్రీ విశ్వవాణి పబ్లికేషన్స్

ప్లాట్ నెం. 159 & 176

102, మైత్రి టవర్స్, కల్యాణి నగర్

హైదరాబాద్ - 500 018

చెరువై పుట్టాలని

వచన కవితలు

వసుధ

వెల : 25/-

పేజీలు : 40

ప్రతులకు :

డోర్ నెం. 4/96, లక్ష్మీనగర్

బందరు రోడ్, గుడివాడ - 521 301

బొంబాయి రవ్వ అరిశలు

కావలసిన పదార్థాలు

ఉప్మారవ్వ	-	పావు కిలో
బియ్యం	-	మూడున్నర పావులు
బెల్లం	-	ఒక కిలో
యాలకులు	-	6

తయారుచేసే పద్ధతి

మూకుడులో రెండు స్పూన్ల నెయ్యివేసి రవ్వను వేయించాలి. యాలకులను పొడి చేయాలి. పాకం పట్టి అందులో రవ్వ, యాలకుల పొడి వేసి తరువాత కొట్టిన పిండిని పోయాలి. బాదం ఆకులమీద (ఆకులు దొరక్కపోతే పాలిథిన్‌కవర్‌ని కట్ చేసి కూడా ఉపయోగించవచ్చు) అరిశలు చేసి మూడు లేదా నాలుగు చొప్పున మూకుట్లోవేసి వేయించాలి. కాలిన అరిశలను అరిశలపీటమీదగాని, అరిశల గరిటమీదగాని వేసి వత్తాలి. అప్పుడు పీల్చుకున్న నూనె పూర్తిగా బయటకు వచ్చేస్తుంది. వీటిని ఒకదాని పక్కన ఒకటి వుంచి ఆరబెట్టాలి. ఆరిన తరువాత డబ్బాలో పెట్టుకుంటే దాదాపు 40రోజులు నిలవుంటాయి.

- గణేశుని స్వరాజ్యలక్ష్మి, గుంటూరు

రుచి

ఇడ్లీతో ఉప్మా

కావలసిన పదార్థాలు

ఇడ్లీలు	-	ఆరు
పచ్చిమిర్చి	-	నాలుగు
అల్లం	-	చిన్న ముక్క
కరివేపాకు	-	రెండు రెబ్బలు
నూనె, పోపు సామగ్రి	-	తగినంత

తయారుచేసే పద్ధతి

ఇడ్లీలను మెత్తగా చిదుముకుని అందులో ఉప్పు, కొద్దిగా వాము కలుపుకుని వుంచుకోవాలి. మూకుట్లో నూనె కాగిన తర్వాత పోపువేసి, ఆనక గుల్లగా చేసుకున్న ఇడ్లీపొడి వేసి వేయించాలి. చక్కగా వేగి, కమ్మటి వాసన వచ్చాక అవసరాన్నిబట్టి కొంచెం కారం, నిమ్మరసం కూడా కలుపుకోవచ్చును.

పిల్లలు ఇడ్లీలు తినమని మారాం చేసినపుడు లేదా ఏ కారణంచేతనో ఇడ్లీలు చల్లబడి మిగిలిపోయినపుడు ఇలా చేసుకుంటే మార్పుగానూ, రుచిగానూ వుంటుంది.

- శ్రీలక్ష్మీసుబ్బారావు, హైదరాబాద్

బద్ధకం

వాసాల నరసయ్య

సుకుమార్ పదవ తరగతి వరకు పల్లెలో చదువుకున్నాడు. తర్వాత కాలేజీలో చేరడానికి బస్తీలో వున్న బసవయ్య తాత ఇంటికొచ్చేశాడు. బసవయ్య తాత ఒక్కగానొక్క కూతురి ఏకైక సంతానం సుకుమార్. అందుకే తాతయ్యగారింట్లో వాళ్లంతా సుకుమార్‌ను సుకుమారంగా, గారాబంగా చూసేవారు. అతిగారాబం సుకుమార్‌ను బద్ధకస్తుణ్ణి చేసింది. తనకు అన్నీ కూర్చున్న చోటే అమరాలనుకునేవాడు సుకుమార్. చివరికి భోంచేసేటప్పుడు తాగడానికి నీళ్లు కూడా ఎవరో ఒకరు తెచ్చివ్వాల్సిందే. తిన్న కంచం సంగతి సరే సరి. ఆ ఇంట్లో చిన్నా పెద్ద అనే తేడా లేకుండా కనిపించిన ప్రతివారికి సుకుమార్ తన పనులు అప్పజెప్పేవాడు.

సుకుమార్ వచ్చిన దగ్గర్నుండి ఇంట్లో వాళ్లందరికీ పని పెరిగిపోయింది. క్షణం తీరిక లేకుండా పోయింది. అదంతా బాగా గమనించిన బసవయ్య తాత ఆలోచనలోపడ్డాడు. ఎలాగైనా చిన్నతనంలోనే సుకుమార్ బద్ధకాన్ని వదిలించాలనుకున్నాడు. లేదంటే పెరిగి పెద్దయ్యాక ఇంకెందరికో సుకుమార్ పెద్ద సమస్యగా మారవచ్చనుకున్నాడు. బాగా ఆలోచించిన మీదట ఆయనకు ఓ చిలిపి ఊహ తట్టింది. మనవడు గనుక సున్నితంగానూ, పరాచికంగానూ ఓ చురక వేయాలనిపించింది.

ఓ రోజు భోజనం చేస్తున్న సుకుమార్ దగ్గరగా వచ్చి కూర్చొని, "చూడు బాబూ! ఎప్పటికైనా నీకు పెళ్లి చేయాల్సిందేగదా. అదేదో ఇప్పుడే చేసేస్తే సరి. నిజం చెప్పాలంటే భర్తకంటే భార్య చిన్నదిగా వుండేట్టు చూస్తారు. ఎందుకంటే ముందుగా ముసలివాడైపోయే భర్తకు భార్య సేవలు చేయడానికి. కానీ నీ మాటకొస్తే ఒక్క పనైనా సొంతగా చేసుకోలేవు కదా. అందుకే మంచి పనిమంతురాలిని, గుణవంతురాలిని, నీ కంటే కనీసం పదేళ్లు పెద్దదాన్ని ఇప్పుడే తెచ్చి నీకు పెళ్లి చేశామనుకో... ఎంచక్కా నీ భార్య నీ పనులన్నీ చేసిపెడ్తుంది. ఏమంటావ్?" అన్నాడు బసవయ్య తాత.

సుకుమార్‌కు నోట్లో ముద్ద దిగలేదు. అతికష్టమ్మీద మింగేసి, గటగటా చెంబుడు నీళ్లు తాగేశాడు. ఆయాసపడ్తూ, "తాతయ్యా! అప్పడే నా పెళ్లికేం తొందర?!" అన్నాడు అక్కడి నుండి జారుకునే ప్రయత్నంలో.

బసవయ్య కాస్త గంభీరంగానే, "నీకు త్వరగా పెళ్లి చెయ్యకపోతే నీ పనులన్నీ చేయడానికి మా అందరికీ ఓపిక ఉండొద్దు మరి" అన్నాడు చిన్న చురక వేస్తూ. సుకుమార్ ఇరకాటంలో పడ్డాడు. "మరైతే నేను ముసలివాణ్ణయ్యాక నా పనులన్నీ ఎవరు చూస్తారు?" అన్నాడు అమాయకంగా.

బసవయ్య నవ్వి, "ఇప్పట్నుండి నీకు సేవలు చేసి చేసి నీకంటే పెద్దదైన నీ భార్య ముందుగానే ముసలిదైపోతుంది. అప్పుడు నీ పనులు నువ్వే చేసుకోవాలి. నీ భార్య పనులు కూడా నువ్వే చేయాలి. ఎందుకంటే అప్పటికి మేం వుండం కదా..." అన్నాడు.

'బసవయ్య తాతయ్య అన్నంత పని చేసినా చేస్తాడు. ఈ గొడవ నుండి తప్పించుకోవాలంటే నా పనులు నేనే చేసుకోక తప్పేట్టులేదు' అనుకున్నాడు సుకుమార్. ఇక ఆ రోజు నుండి బద్ధకాన్ని వదిలిపెట్టేశాడు. తన పనులు తానే చేసుకోసాగాడు. తాతయ్య చురక బ్రహ్మాండంగా పని చేసినందుకు ఇంటిల్లిపాది ఎంతో సంతోషించారు.

బాలల కథ